UNIVERSAL LIBRARY
OU_206058
UNIVERSAL LIBRARY

OUP—881—5-8-74—15,000.

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T81 S25M    Accession No. P.G. T7294

Author సత్యనారాయణశాస్త్రి, వేదుల.

Title [illegible]

This book should be returned on or before the date last marked below.

గౌతమీకోకిల గ్రంథమాల ద్వితీయపుష్పము

# ముక్తఝరి

గ్రంథకర్త:

శతావధాని, గౌతమీకోకిల, మహాకవి,

శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రి

(ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ యావజ్జీవసభ్యులు)

★

ప్రకాశకులు:

శిలిగం జగన్నాథం,

గౌతమీ కోకిల గ్రంథమాల,

కూనవరం,

భద్రాచలం తాలూకా, ఖమ్మం జిల్లా.

సర్వస్వామ్యములు గ్రంథకర్తవి ప్రతులు 1000

మూల్యము : నాలుగు రూపాయలు.

అవంతీ ప్రెస్,
రాజమండ్రి - 2.

# కృతజ్ఞతలు

మా గ్రంథమాల స్థాపన, నిర్వహణములకు మా కత్యంత ప్రోత్సాహ మొసంగి, నిర్మాణాత్మకమగు సూచన లొసంగి తోడ్పడు చున్న సంస్కృతాంధ్రాంగ్లేయ ఉర్దూభాషా విశారదులు, 'వారసురాలు' 'మాదన్న' మున్నగు చరిత్రాత్మక నవలాకర్తలు నగు శ్రీ కె. వి. భూపాలరావు. M. A., (డిప్యూటి కలక్టరు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లా) గారికిని,

మా గ్రంథమాల పక్షమున ప్రచురించుకొనుటకు వారి రచనలను సాదరపూర్వకముగ నొసంగిన శ్రీ వేదుల మహాకవి గారికిని,

ఈ గ్రంథమునకు 'ప్రస్తావన' వ్రాసి యిచ్చిన డాక్టరు శ్రీ శొంఠి సూర్యనారాయణరావు. PH. D., (హేంబర్గు) గారికిని,

శ్రీ వేదుల మహాకవి 'పరిచయము' ను వ్రాసిన మా మిత్రులు, 'భాషాప్రవీణ' శ్రీ మిరియాల రామకృష్ణ. M. A., (సహాయాంధ్రోపన్యాసకులు, P. R. G. కాలేజి, కాకినాడ) గారికిని,

మా కృతజ్ఞతాభివందనము లర్పించుచున్నాము.

శిలిగం జగన్నాథం,
వ్యవస్థాపకుడు,
గౌతమీకోకిల గ్రంథమాల,
కూనవరం.
భద్రాచలం తాలూకా, ఖమ్మం జిల్లా.

# విజ్ఞప్తి

ఖమ్మంజిల్లాలో నున్న ఏజెన్సీ ప్రాంతములగు భద్రాచలం, వెంకటాపురం, నూగూరు, పాల్వంచ, బూర్గుంపాడు తాలూకాలు సాహిత్య సాంస్కృతిక రంగములలో చాలా వెనుకబడియున్నవి. ఈ తాలూకాలన్నియు గోదావరికి ఉభయ తీరములలోను ఉన్నవి. అందుచే సహజముగా సౌందర్యపిపాస, కళాకౌశలము, సాహిత్యాభిమానము గలిగికూడ తగిన ప్రోత్సాహము, అవకాశములు లేక ఎంతోమంది రచయితలు మరుగున ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరించిన తరువాత ఈ ప్రాంతముల అభివృద్ధికి ప్రభుత్వం నూతనపథకముల నెన్నిటినో ప్రారంభించినది. ఈ అన్నిటితోపాటు ప్రజలలో సముజ్జ్వలమైన సాహిత్య చైతన్యమును రగుల్కొల్పవలసిన అవసరముకూడ ఉన్నది. దానికి నాందిగ శ్రీ గౌతమీ కోకిల గ్రంథాలయమును 15–8–1964 నాడు కూనవరంలో స్థాపించి యథాశక్తి భాషా సేవ జేయుచున్నాము.

గ్రంథ ప్రచురణద్వారా కూడ సాహిత్యారాధన చేయవలెనను తలంపుతో తోటపల్లి గ్రామస్థులు, కావలి కాలేజి మాజీ ఆంధ్రోపన్యాసకులు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి యావజ్జీవ సభ్యులు, శతావధానులు, 'గౌతమీకోకిల' మహాకవి బ్రహ్మశ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రిగారి రచనల నన్నిటిని ప్రచురింపబూనుకొని ఈ గ్రంథమాలను నెలకొల్పి, ప్రథమ పుష్పముగా గత సంవత్సరము "వేదులవారి కథలు" ను ప్రచురించగా గ్రంథప్రాశస్త్యమును గురించి ఆంధ్రప్రభ, ఆంధ్ర జ్యోతి, ఆంధ్ర దినపత్రికలు మంచి సమీక్షలను ప్రచురించి, మా



శ్రీ గౌతమీ కోకిల గ్రంథమాల వ్యవస్థాపకులు,

శి లి గం జ గ న్నా థ ం.

యుద్యమమున కెంతయో ప్రోత్సాహము నొసంగినవి. అందువల్ల ప్రకృత మీ 'ముక్తఝరి' కావ్యమును ద్వితీయ పుష్పముగ ప్రచురించుచున్నాము. గత ప్రచురణమునువలె ఈ ప్రచురణమును కూడ పాఠక మహాశయులు సమాదరించి మా సంకల్పమును సఫలీకృత మొనర్తురని విశ్వసించుచున్నాము.

శ్రీ వేదులవారి రచనలనేగాక అవకాశమునుబట్టి మా ఏజన్సీ ప్రాంతములోని రచయితల గ్రంథములను గూడ ప్రచురింపగలమని మనవి.

నూగూరు తాలూకా 'చర్ల' గ్రామములో కొందరు యువరచయితలు, ముఖ్యముగ 'మాల్యశ్రీ' పేరులో రచనావ్యాసంగము సలుపుచున్న శ్రీ చింతూరి మల్లయ్య మున్నగువారు 'ఏజెన్సీ సాహితీమిసతి'ని స్థాపించి 'మన్నెసువాలు' అను సంకలనగ్రంథమును ప్రచురించి యుండుటయును, ఇంకొక కథాసంపుటమును ప్రచురింపదలచుటయు ముదావహమగు విషయము. ఈ ఏజెన్సీ ప్రాంతములో సాహిత్య చైతన్యము కలుగజేయుటకు గ్రంథాలయములు, గ్రంథమాలలతోపాటు ఏజెన్సీ రచయితల రచనలకు ప్రాధాన్యత నిస్తూ ఒక సాహిత్య మాసపత్రికనుగూడ "గౌతమీ కోకిల" అను పేరుతో ప్రారంభించవలెనను సంకల్పముతో నున్నాము. పరిస్థితులు అనుకూలించినచో అచిరకాలముననే మా సంకల్పము కార్యరూపము నందగలదని మనవి చేయుచున్నాము. మా ఏజెన్సీలోని సోదర సాహిత్య సంస్థయగు యీ 'ఏజెన్సీ సాహితీ సామితి'కి మా శుభాకాంక్షల నందజేయుచున్నాము.

శిలిగం జగన్నాథం, వ్యవస్థాపకుడు

# రెండు మాటలు

ఈ 'ముక్తఝరి' నా రెండో ఖండకావ్య సంపుటము. 'దీపావళి' అనే సంపుటాన్ని ప్రకటించిన ఎంతో కాలానికి మళ్ళీ నా పద్యాలను గ్రంథరూపముగా అచ్చులో చూసే అవకాశము ఇప్పటికి నాకు లభించింది అదే నాకొక సంతృప్తి. దీనిని లోకముముందు పెట్టడముకన్నా నేను చెప్పుకోవలసిందేమీ లేదు. బాగోగులు చెప్పవలసినవారు సహృదయులే. "ఏ గతి రచించిరేని సమకాలమువారలు మెచ్చరేగదా" అనే భయము నాకు లేదు. "ఏదో గుణమున హృదయాహ్లాదం బొదవించు కావ్య మార్ద్రహృదయులామోదింతు రెపుడు" అనే కవి సూక్తిపై నాకు నమ్మక మున్నది.

రచనకొక కాపీ జాగ్రత పెట్టుకొనే అలవాటు నాకు మొదటనుంచీ లేదు. అందువల్ల చాలా పద్యములు మరుగుపడి పోయినవి. తాము సేకరించుకొన్న పద్యాలను కొందరు మిత్రులు పంపారు. వాటిలో కొన్నిటిని ఇందు చేర్చాను. విషయాన్నిబట్టిగాని, కాలాన్నిబట్టిగాని, కవితాఖండాలను విభజించలేదు. విషయ వైవిధ్యాన్ని భావుకులే గ్రహించుకోగలరు.

ఈ సంపుటము ఈ విధంగా వెలువడడానికి సాహితీప్రియులైన శ్రీ శిలిగం జగన్నాథంగారి ఔదార్యమే కారణము. వారికి కృతజ్ఞత తెల్పడానికి నా మాటలకు శక్తిచాలదు.

కాన కృతజ్ఞతాముగ్ధమైన హృదయముతో వారికి నేను శుభాశీస్సు లర్పించుచున్నాను.

ఈ సంపుటానికి ప్రస్తావన వ్రాసినవారు డాక్టరు శ్రీ శొంఠి సూర్యనారాయణరావు, Ph. D., (హేంబర్గు) గారు. స్వదేశములో కళాశాలావిద్య ముగించి, జర్మనీవెళ్ళి ఆ భాషలో పాండిత్యము సంపాదించి రసాయన శాస్త్రములో డాక్టరేటు సంపాదించారు వారు. ఇంగ్లీషు, ఫ్రెంచి జర్మను, భాషా సాహిత్యాల లోతుపాతులు సమగ్రముగా గ్రహించిన వ్యుత్పన్నులు. సంస్కృతాంధ్ర సాహిత్యాలలో వారు చేసిన పరిశ్రమకూడా తక్కువది కాదు. చదివినది రసాయనశాస్త్రమైనా సాహిత్యరస శాస్త్రములో వారి కృషి ఎంతో ప్రశంసనీయము. అట్టివారి 'ప్రస్తావన' ఈ సంపుటాని కొక అలంకారము. నేను మనసారా వారిని ఆశీర్వదించడంకన్నా చేయగలిగింది లేదు.

గ్రంథరూపమును దిద్దడానికి బాధ్యులు ముద్రాపకులు. ఆ బాధ్యతను నెరవేర్చుకొన్న 'అవంతి ప్రెస్' వారికి నా కృతజ్ఞత.

మైసూరు,
1-2-1[redacted]

వేదుల సత్యనారాయణశాస్త్రి.

# వేదుల వ్యక్తి శక్తి

నిత్య వినిర్మల మందహాసాలొలికే కనుగోనలతో, తీయని స్వప్న మేదియో పైకొనినట్లు కనపడే ముఖాకృతితో, ఆడంబరాలకు చెంప పెట్టయిన వేషంతో, దువ్వీదువ్వని జుత్తుతో, పండిత లాంఛనమైన శాలువతో, ఊనికలు తూనికలుగా ఆడే మాటలతో, పూలు పూచినటు లయ్యే ఎదదతో — ఒకానొకనాడు గౌతమీతీరాలలో, కవితాసమితిలో, సాహితీసమితిలో, నవ్యసాహిత్యపరిషత్తులో కావ్యకళ లోతులు ముట్టిన మేటిశిల్పి —

**శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రి**

'ఇరువదై దేండ్ల నా బ్రతుకిట్టె గడచె' అని 'దీపావళినాడు' మరణవాద్యము లట్లు గుండియలు కొట్టుకొన నేడ్చుకొన్న 'వేదుల' శోకమే భావుకు లందరికీ రసశ్లోకమైంది.

క్షీరసాగరం, వినీలాంబరం, ఉమాలాస్యం, జగదీశ్వర జటాజూటసుధామయూఖరేఖ — వీరి కవిత్వానికి పర్యాయపదాలు. వీరి తొలి కావ్యం 'దీపావళి'. అది మనిషి గుండెల్లో దీపావళి. ప్రపంచపు దీపావళి వేదులకు ఒకప్పుడు దీపావళి కాదు. వారి దీపావళి మాత్రం మానవ ప్రపంచానికి ఆరని దీపావళి.

పావన గౌతమీ పులిన సీమలు వారి కవితా ప్రేయసి విహార స్థలాలు. తృణశయ్యలందు శయనించి, తనవలె శుష్కజీవనమునన్ దురపిల్లెడి పవిత్రగోదావరి పేదవడ్డ నినదమ్ములతో శ్రుతికల్పి, ఆత్మాశ్రయ కవిత్వానికి జీవం భావం పోసిన అచ్చమయిన తెలుగుకవి వేదుల.

మలికావ్యం ఈ 'ముక్తఝరి' వసుధైక కుటుంబానికి నాందీ గీతాలూ, మానవాత్మకు వైతాళికాలూ, భారతప్రాభవానికి నివాళిపదాలూ పాడే మనోహరి. ఈ ముక్తఝరి.

బహుళంగా భావకవుల్లో భావస్పష్టత కొఱవడింది. వీరిలోనో, స్పష్టతలేని భావమే లేదు. ఆవేశమూ సంయమనమూ చేతులు కలిపితే, ప్రతిభా వ్యుత్పత్తులు జటాపటాలు వేసుకుంటే వేదులవంటి భావకవులుద్భవిస్తారు.

బ్రహ్మసమాజ మిచ్చిన చైతన్యబలంతో మూఢవిశ్వాస శృంఖలములు విదల్చి తనజీవితానికి శరదుత్సవం చేసుకున్న సంస్కర్త, వేదుల.

'దీపావళి' ప్రణయవేదనలో, ప్రవాసంలో, రహోవిరహ భుగ్న దురంత విషాదంలో, జనానాంతర స్మృతులలో, సౌందర్య రసైకభావనలో, ప్రేమస్వప్నాలలో వెలిగిన అనర్ఘ కవితాకాంతి!

ఆ ప్రవాసంనుంచి, విరహంనుంచి విముక్తినొందిన తర్వాత,

"ఊపిరి యాడనీని కఠినోపల బంధములో కలాకలా
లాపముగాని నర్తనవిలాసము గాని ధరాపరీమళా
వాపముగాని లేని పుటపాకపుచీకటి జీవితమ్ము నె
ట్లోపితినో గదా! అవలియొడ్డగుపింపని కాల మీదుచున్."

అని సింహావలోకనము చేసుకోవడంలోనే 'ముక్తఝరి' కావ్యం అవతరించింది.

గంగలో గొల్లపల్లివంటి తోటపల్లిలో, సీతారాములు తిరుగాడిన దండకారణ్యంలో, భద్రగిరి కల్లంతదూరంలో పురుటినీళ్ళు పోసుకొని, ఆ గౌతమీతీరపు తోటల్లో కోకిల కూతలు వింటూ, ఆ నదీసైకతాల్లో పిచ్చుకగూళ్ళు కట్టుకుంటూ ఆడుకున్న 'వేదుల' కవిత్వానికి అనుభూతి, ఆవేదన, ప్రణయపిపాస, సౌందర్య పారవశ్యం, దేశభక్తి, మానవతా

ప్రబోధం, మధురభక్తి ప్రకృతితాదాత్మ్యం—ఇవే జీవధాతువులవడంలో ఆశ్చర్యం లేదు. ఆయన 'గౌతమీకోకిల–' తొలినాళ్ళలో 'కవిసార్వభౌమ' శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి అంతేవాసిగా, గురుకుల క్లిష్టత ననుభవిస్తూ సాధించిన కవితాహేతువుల్లో శతావధాన ప్రజ్ఞ పాటవము రించినా, నవ్య సాహిత్య పరిషత్తులో ఆశుకవితా సన్యాసం పుచ్చుకుని, రసాత్మ నందుకున్నారు, శ్రీ వేమల. ఆంధ్ర గీర్వాణ వంగ భాషా సారస్వతాలు కొల్లగొట్టుకున్నారు కాళిదాసభవభూతులు, రవీంద్ర కృష్ణశాస్త్రులు ఆయన భావనామందిరంలో బస చేయడానికి వచ్చారు. నన్నయ, తిక్కన, తిమ్మన, క్షేత్రయ్య వంటి మహాంధ్రకవు లాయన వాక్ పరీమళానికి దోహదం చేశారు.

వేమలవారు నవ్య సాహిత్య ప్రక్రియ లన్నింటినీ చేరదీశారు. అలనాడు వీరు రచించిన నవలలు 'రంగమహాలు, ధర్మపాలుడు' ఈ నాటికీ అపురూపాలే, భారతీయ సాహిత్య అకాడమీ కోరికపై అనువదించిన 'వినోదిని' (చొఖేర్ బాలి) 'రవీంద్ర బాలసాహిత్యం' తెలుగు సాహిత్యానికి క్రొత్త గుబాళింపులు. 'ఆర్తనాదం' మొదలయిన కథలు రచించి ఆయన తన హృదయంలోని రసభావాలకు ఆవిష్కార మిచ్చారు. శ్రీ శలిగం జగన్నాథం మనీషి వాటిని ప్రచురించి గౌతమీకోకిల గ్రంథమాలలో గ్రుచ్చారు.

'జానపద వాఙ్మయం' 'తెలుగు హాస్యం' మొదలయిన వ్యాసాలూ రేడియో ప్రసంగాలూ వారి లోకజ్ఞతకు, పరిశోధనకు దృష్టాంతాలు,

విద్యార్థులకోసం సంకలనం చేసిన 'కావ్యజ్యోతులు', వ్రాసిన వాచకాలూ వారి ఉపాధ్యాయకత్వ అనుభవానికి ప్రతీకలు.

వ్యక్తిగా ఆయన నిర్మలుడు, స్నేహశీలి. గుంటూరు, రామచంద్రపురం, పెద్దాపురం, సామర్లకోట, కావలి మొదలైన చోట్ల ఆయనచే ప్రభావితులైన సాహిత్యవిద్యార్థు లెందరో ఉన్నారు.

ఏలూరులో జరిగిన సన్మానంలో—

నరపతి మెచ్చి యిచ్చెడి ధనంబులు గాని మణీవిభూషణాం
బర బిరుదాగ్రహార పరివార విస్తారము గాని నా కిటుల్
సరసులు పండితేంద్రులు కళాజగతీ సహాయాత్రికుల్ మహా
దరమునఁజేయు మన్నన విధంబున నింపును బెంపు నింపునే.

అన్నారాయన. ఈ మాటల్లో కాళిదాసాదులు చూపిన వినయ మాధురి తొంగి చూస్తుంది

నవయుగ వైతాళికుల్లో వేదుల ఒకరు.

'దీపావళి' కృతినందిన శ్రీ నూతక్కి రామశేషయ్య చౌదరితో పాటు, నిండోలగంలో సన్మానంచేసిన శ్రీ విక్రమదేవవర్మతో పాటు. పూలపఅపులపై నడిపించిన హేలాపురీరసజ్ఞులతో పాటు. 'మహాకవి' అని సంబోధించిన శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రితో పాటు.

వేమల పేరితో గౌతమీ కోకిల గ్రంథమాలను, గౌతమీ కోకిల గ్రంథాలయాన్ని స్థాపించి. ఆయన నన్నివిధాలా సన్మానించి, 'ముక్త ఝరి'ని ముచ్చటగా ముద్రింపించి, ప్రకటిస్తున్న శ్రీ శలిగం జగన్నాథం కూడా చరితార్థుడు.

'భాషా ప్రవీణ'
మిరియాల రామకృష్ణ, M. A.
(సహాయాంధ్రోపన్యాసకులు, P. R. G. కాలేజి)

1968 సంక్రాంతి,
కాకినాడ.

# ప్రస్తావన

విద్వత్కవులు, శతావధానులు అయిన శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రిగారు "ముక్తఝరి" అనే నూతన కావ్యసంకలనాన్ని విడుదల చేస్తున్న యీ రోజు ఆంధ్ర సాహితీ లోకానికి పర్వదినం. భావకవిత్వం ముమ్మరంగా కొనసాగిన రోజులలో దీపావళిగా ప్రకాశించిన "దీపావళి" కావ్యానంతరం ఎన్నో వసంతాలు గడచిపోయినా 'గౌతమీ కోకిల' మధురస్వనం మనకు కరువయి పోయినది. వేదులవారి కవితా ప్రసూనాలను సమగ్రంగా చూడాలనే కోర్కె సాహితీ ప్రియులైన శ్రీ శిలిగం జగన్నాథంగారివల్ల యిన్నాళ్ళకు నెరవేరింది. ఈ శుభసమయంలో వారి కవితా వైదగ్ధ్యాన్నిగూర్చి ప్రస్తావించాలనే అభిలాషను శిష్యవాత్సల్యంతో వా రంగీకరించారు. దిగ్దంతులైన కవిశ్రేష్ఠులు, దురంధరులైన విమర్శకులు పూనుకోవలసిన కార్యానికి, సాహిత్యవృత్తికి దూరంగా ఉంటున్న నావంటి యువకుడు సాహసించడం ఆశ్చర్యజనకం కావచ్చును. కాని భావకవిత్వపు యుగాన్నిగూర్చి చరిత్రగా చదువుకొన్న నావంటి యువకులే నిష్పాక్షిక దృష్టితో పరిశీలించి అందలి సార్వకాలీనతను గుర్తించగలరని నా నమ్మకం.

'ముక్తఝరి' వారి మాటల్లో "కాలిడిన చోటుల నెల్ల పైరుపచ్చల పెంపువార జేసి" నట్టే సాహితీక్షేత్రంలో ప్రవహించి సాహిత్యాభిలాషుల నానంద వార్ధిలో ముంచి తేలించి ఉత్తమ కావ్యరచనను ప్రోత్సహిస్తుందనడంలో సందేహములేదు. వయస్సులో చిన్నవాడనైనా, 'వేదులవారు' ఆధునికాంధ్ర సాహిత్యంలో అత్యుత్తమ స్థానాని కర్హులని చెప్పగలను. కవిసార్వభౌములైన శ్రీపాదవారే 'మహాకవి' అని నిర్ణయించినవారి

విషయంలో నా ప్రశంస పునరుక్తి మాత్రమే అవుతుంది. కేవలం వారిని శ్లాఘించడంతో తృప్తి పడకుండా వారి కవితలోని విశిష్టతను సోదాహరణంగా విజ్ఞులకు విజ్ఞప్తి చేయడమే నా ఆశయం.

ప్రప్రథమంగా పాఠకుల నాకర్షించేది వారి కవనంలో గల రమణీయత. ఎన్నో తర్జన భర్జనల పిదప పండితరాయల వారి ద్వారా తేలిన సారాంశ మదియేకదా. Poetry is the most delightful and perfect form of utterance that human words can reach అనడానికి వేదులవారి "రాధ", "ఆరాధన" వంటి కళాఖండాలే సాక్ష్యాలు. ఆంధ్రుల భావకల్పన వారి కలంలో పరాకాష్ఠ నందుకున్నది. "ప్రకృతి పులకింప, యమునా స్రవంతి పొంగ, రాగవల్లిక చిగురింప" అనే టప్పుడు Best words in best order అన్న Coleridge సూక్తి నిజమవుతుంది.

అంత మాత్రాన "ఏదియో అపూర్వ మధురరక్తి స్ఫురియించు కాని అర్థమ్ముకాని భావగీతమ్ము లవి" అనేసి ఊరుకోలేము. పదవిన్యాసంతోపాటు అర్థానికి వారి రచనల్లో సమాన గౌరవం లభిస్తుంది. అస్పష్టత కవిత్వానికి ముఖ్యలక్షణంగా చెలామణి అవుతున్న యీ రోజుల్లో వేదులవారి శైలి విశిష్టమైనది. భావకవిత్వం ఉచ్ఛస్థితిలో నున్న రోజులలోకూడ వారు Symbolist poetry కి దూరంగానే నిలిచారు. వేదులవారి 'శైశికీ గీతికలు' పాఠకులను నిద్ర పుచ్చే జోలపాటలుకావు. పైగా వారి మనోవీధిలో తాత్త్విక జిజ్ఞాసను రగుల్కొలుపుతాయి. అందులకే ముద్దుకృష్ణగారు ఆయనను కవీనాం కవి అనిపించుకొన్న Shelly తో సరిపోల్చారు. భావకవులలో తాత్త్విక దృష్టిని ప్రదర్శించినది, ప్రధానంగా వేదులవారొక్కరే. అందుకు కారణం వారు ఆదర్శవాదులు కావడం ఆనాటి కవులలో మానవత్వం. అభ్యుదయ దృక్పథం కనపరచినది రామిరెడ్డి, వేదుల మొదలైన కొందరు. ప్రాచీన సంస్కృతి

సంప్రదాయంపై విశేష గౌరవమున్నప్పటికీ వారి నాకర్షించినవి ఆంధ్రుల సామ్రాజ్యాలు, పౌరుషప్రతాపాలే కావు. వారి దృష్టి ఎప్పుడూ ఉన్నతాశయాలపైనే కేంద్రీకృతమైనది. అయితే నిరర్థకమైన నీతి పాఠాలతో సంతృప్తి పడకుండా సంఘంలోని అంతస్తులకు, అధర్మాన్ని గుర్తించి, అన్యాయాన్ని తీవ్రంగా తమ రచనల్లో విమర్శించేరు "పేదల రక్తమాంసముల పెంపు వహించి దయారసామృతాస్వాద దరిద్రులైన ధనవంతుల పెద్దరికాన్ని" నిరసించి, వారిని "కార్మిక ప్రజా స్వేద ఫలమ్ముతో నినుపపెట్టెల నింపెడి నిర్దయు" లన్నారు. మతం ధర్మం అంటూ ప్రచారం చేసే పెద్దమనుష్యులు ధనికవర్గానికి హారతులిస్తున్నారని ప్రస్తుత కావ్యసంపుటిలో యీ క్రింది విధముగా వారి గుట్టు బటబయలు చేశారు,

"మానవుని దృప్త హృదయమ్ములోని తృష్ణ
దేవసింహాసనం బెక్కి తీర్చెఁ గొలువు
మతము ధర్మము తత్సభా మందిరంబు
గుమ్మమును గాచు బ్రతుకుబత్తెమ్ము గోరి."

ఇంతకు పూర్వ మొకసారి మానవత్వం లోపించిన "దేవునికి మారుగ నిల్చిన రాతి బొమ్మలకు" చేసే పూజలు వ్యర్థమైన వన్నారు "మూఢ విశ్వాస శృంఖలమ్ములు విదల్చి వలపు కౌగిలి" లో ప్రేమికులు నవజీవనం సాగించాలన్నారు. అయితే యీ స్వేచ్ఛ అనేది వ్యక్తిగతమైన సమస్యమాత్రమే కాదని, సంఘం యావత్తుకు చెందిన విషయమని వేదులవారు గుర్తించి "దూరదూరాల తీరోపతీరములకు మోసికొనిపోదు స్వేచ్ఛా ప్రమోద వార్త!" అనడమే కాకుండా 'ముక్తయురి' చేత "సాగరయాత్ర కుపక్రమింతు నా త్రోవకు నడ్డమౌ గిరితతుల్ గహనమ్ములు ఛిన్నభిన్నమైపోవ" అని ప్రతిజ్ఞ చేయించారు. మన పూర్వులు కవులు నిరంకుశులన్నప్పుడు స్వేచ్ఛాజీవులనే అర్థం చేసుకోవాలని వేదులవారు నిరూపించారు. ఇంగ్లాండు దేశములోకూడ పూర్వపు రోజుల్లో

కవుల సంఘానికి "Those who are free throughout the world" అనే motto వుండేదిట. ఈ విధమైన అభ్యుదయ భావాలు వ్రాకుచ్చినందువలన వేములవారు అభ్యుదయ కవులకుకూడ మార్గదర్శకులే.

ఈ సంకలనంలో దేశభక్తిని ప్రబోధించే జాతీయ గీతాలు, స్వాతంత్ర్యాగమనం, చైనా దురాక్రమణ వంటి సందర్భములలో జరిపిన రచనలు యిత్యాదులు ఉన్నాయి భావకవులు కావడంచేత వారి కవితలో కథావస్తు వేమయినప్పటికిని ప్రత్యేకత కనబడుతుంది. "తెలుగుతల్లి" పై వారికిగల మాతృప్రేమ యీ సంపుటిలో వ్యక్తమవుతుంది. తెలుగు వారి నుత్తేజపరిచే గీతాలు యిటువంటివి చాలా అరుదుగా వెలువడ్డాయి. ఈ విధంగా పాఠకుల హృదయాలకు హత్తుకొనిపోయే రచనలకు "మిత్రస్మృతి" ని తార్కాణంగా పేర్కొనవచ్చును. Elegy రచనలు ఆంధ్ర సాహిత్యంలో వ్రేళ్ళపై లెక్కింపవచ్చు. హృదయ విదారకమైన సంఘటనము, శోకరసభరితమైన దృశ్యాలను వర్ణించడం వేముల వారి వంటి ఉత్తమ కవులకే సాధ్యమవుతుంది. ఇలాంటి సందర్భాల లోనే Shelly తో పాటు Poetry is the very image of life అనగలం "అంధగీతి" అనే శీర్షిక కూడ యిట్టి చేతనాత్మకమైన రచన. అదృష్టవశాత్తు వేములవారికి ఆంగ్లభాషతోగాని, సాహిత్యంతో గాని పరిచయం లేకపోబట్టి గాని లేకుంటే యివన్నీ అనుకరణ లనే అపోహ కలిగేది. "హేమంత రాత్రిని పెండ్లి నడకల వయ్యారి"గా వర్ణించినా, "ఆకు రాలిన మోడులపై పడ్డ మంచు జీవకళగా" కన్పించినా, "ఇంద్ర ధనుస్సు మణిమయ సోపాన సరణి"గా స్ఫురించినా, వారి భావనాగరిమ ప్రస్ఫుటమవుతుంది కాని కేవలం చమత్కారం ఒక్కటే కాదు– హృదయాత్మకమైన ఆధ్యాత్మిక చింతనే "పూజాప్రసూనాలు", "ముక్తావళి", "ఉత్కంఠ", "ఆశాగానం" వంటి ఉత్కృష్టమైన గీత పరంపరకు దోహదం చేసింది వారి భావాలు టాగూరును తోపింప చేస్తాయి అంటే

అతిశయోక్తి కాదు. ప్రభుత్వం అచ్చువేయించే అనువాదాలకంటే మహా కవులలో వ్యక్తమయే భావమైత్రికే సార్వకాలీనత, సాహిత్య గౌరవం లభిస్తాయి.

వేదులవారి కవితలో మరో విశిష్ట లక్షణం ప్రశాంతత. షెల్లీతో పోలిక కొంతవరకు మాత్రమే షెల్లీకి ప్రశాంతత చివర రోజులలోనే అలవడింది. కవికి కావలసినది ఆవేశం ఒక్కటే కాదు "Poetry is not a turning loose of emotion but an escape from emotion. The emotion of Art is impersonal" అంటాడు Eliot. వ్యక్తిగతమైన ఆత్మసంక్షోభంకాక సంఘంలోని అన్యాయాన్ని, గాయపడిన సున్నిత హృదయాల పరితాపాన్ని కావ్యరూపంలో చిత్రించడంతోనే ఉత్తమ కవిత ఉద్భవిస్తుంది. Baudelaire తోనే Lyric రచన యిట్టి ఆధునికపంథా నవలంబించినది. మరో విషయం. వేదులవారి రచనల్లో కరుణరసం పొంగి పొరలినా, నిరాశావాదం కని పించదు "ఆకొనినయాశ లెప్పటి కప్పు డెవియొ కలయత్రిప్పును స్వప్న సాగర తటాల:" అన్నారు. "రాతిగుండె లోకము నిప్పులు గురియ నిమ్ము. హృదయ మున్నంతవరకు, నా ప్రేమకాంక్ష, బ్రతికి యున్నంత వరకేడ్చి బ్రదుకుచుందు" అని ఆత్మ స్థైర్యాన్ని ప్రకటించారు. ఇట్టి ఆత్మవిశ్వాసం ఆశాజీవుల లక్షణం జర్మన్ సాహిత్యంలో చిరంజీవి అయిన Heine తన మరణశయ్యపై కూడ.

"Doch fall' ich unbesiegt, und meine waffen
Sind nicht gebrochen - nur meine Herze brach"

"నా హృదయం గాయపడింది. కాని చేతిలో ఆయుధాలు చెక్కు చెదరకుండా అలాగే ఉన్నాయి. ఇతరులు కొనసాగిస్తారు, యీ పోరాటాన్ని" అని కన్ను మూసాడు.

మా తరం యువకులం "మరో ప్రపంచం" అంటూ ముందుకు ఉరికేం. కాని మా ఆశలు అడియాసలయ్యాయి. ఉత్సాహం సన్నగిల్లింది. దేశం Waste land గా మారింది. ఈ నిరాశా వాతావరణంలో Ginsberg శిష్యకోటి పెరుగుతోంది. మరోవైపు సినిమాల ధర్మమా అంటూ మళ్ళీ భావకవిత్వంపై మోజు పెరిగింది. ఈ పునర్జన్మ గేయ రూపంలో జరగడం నుంచి భావ కవిత్వంపై పునఃపరిశీలన అవసర మయింది.

సరిగ్గా యిదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఆరుద్రగారీ మధ్యను పద కవితలపై పండితుల చిన్నచూపు సమంజసం కాదని, చిత్రసాహితికి కూడ సాహిత్య గౌరవం లభించాలని విజ్ఞప్తి చేసారు. చిత్రసీమలో ప్రతిభావంతులైన రచయితలు పాల్గొంటున్న మాట వాస్తవమే. వారి కృషిపై నాకు గౌరవం లేకపోలేదు. కొంతమంది నాకు పరిచితులు, ఆత్మీయులు కూడా. కాని తాత్కాలికానందమే ప్రధాన లక్ష్యంగా కొన సాగుతున్న యీ గేయరచన ఉత్తమసాహిత్యానికి వారసురాలా ? అనేదే ప్రశ్న. కేవలం శబ్దవైచిత్రి, చమత్కారం కవన మనిపించుకోవు. Robert Frost చెప్పినట్లు A poem begins in delight and ends in wisdom. వేదాంత చర్చ కాకపోయినా మరోసారి జ్ఞప్తికి వచ్చే భావం స్ఫురించాలి. బసవరాజుగారిని సాహితీపరులు మరచిపోలే దంటే వారి గేయాల్లో కనబడే మాధుర్యంతో మిళితమైన భావోత్కృష్టత. అసలు గేయాలకు సాహిత్యంలో స్థానం ఎలాంటి దని నిర్ణయించా లంటే సంగీతానికి, సాహిత్యానికి గల బాంధవ్యాన్ని గూర్చి చర్చించవలసి ఉంటుంది. ఛందస్సు విషయమై యిటీవల 'భారతి' లో కనబడే వాదోప వాదాల్లో కూడ యీ అంశం విశదమవుతోంది. భాష, తద్వారా కావ్య రచన గానకళ అనేవి రెండూ నాదంలోంచే జనించినా విభిన్న మార్గా లలో పయనించి పరిపూర్ణత చెందాయి. ఈ రోజు వాటికి గల సామాన్య

గుణం లయ ఒక్కటి మాత్రమే. సంగీతం శ్రుతి ప్రధానమైనది. శబ్దంతో దానికి ప్రమేయం లేదు. పాశ్చాత్య దేశాలలో గాత్ర సంగీతానికి ప్రాముఖ్యత లేనేలేదు. శబ్దార్థ సంహితమైనది కవిత. అయితే ప్రాథమిక దశలో జానపద గేయాలు, పదకవితలు ప్రతి జాతి చరిత్రలోను కన బడతాయి.

భాష పుట్టుపూర్వోత్తరాలు, కవిత్వవికాసము, మున్నగు విష యాలను గూర్చి Santayana విపులంగా చర్చించాడు. భాషకు అర్థం ప్రధానం కాబట్టి శబ్దసౌందర్యం వస్తుస్ఫురణపై ఆధారపడి ఉంటుంది. అయినా "జ" "ష" వంటి ధ్వనులలో అనిర్వచనీయమైన మాధుర్యత ఉన్నదని కొందరి అభిప్రాయం. ఏ భాషకి చెందిన కవి ఆ భాషలోని పదాలనే వినియోగించక తీరదు కాబట్టి ఛందస్సునే ముఖ్య సాధనంగా గైకొని కావ్యాన్ని సృష్టిస్తాడనీ, శబ్దాలలో స్ఫురించే ధ్వని, ఆ యా భాషల హలంత, అజంత యిత్యాదుల ప్రత్యేక స్వభావం కూడ యీ కృషికి తోడ్పడుతుందనీ ఆయన అభిప్రాయం. Pythagoras చెప్పి నట్లు సంఖ్యలో పరమార్థం ఉందని అంగీకరించకపోయినా ఛందోబద్ధ మైన కవితలో సుందరత, శ్రావ్యత ఉండటం మాట నిజం. అయితే ఛందస్సే కవిత్వానికి నిర్వచనం అనలేము గద్యం గొప్పదా, పద్యం గొప్పదా? వచనంలో రసాత్మకమైన రచన అసాధ్యమా? అనే విషయం ప్రధాన సమస్యగా నేను పరిగణించను Bennet చెప్పినట్లు విశాల దృష్టితో చూస్తే సాహిత్యాన్నంతటినీ కవనంగానే పరిగణింపవచ్చును. మనం మట్టుకు భట్ట బాణున్ని మహాకవిగా గౌరవించడం లేదా? కాని దండివంటి లక్షణకారుడు కూడ గద్యనే అభిమానించినా పద్యానికే సర్వదా సర్వత్రా ఆ గౌరవం ఎలా లభించింది? ఇన్నాళ్ళుగా ఉపయోగ పడుతున్న పనిముట్టుని అనవసరమని అస్త్ర సన్యాసం చేయవలసిన అగత్యం దేనికి? నూతన ప్రక్రియల కెప్పుడూ అవకాశం ఉన్నది. కాని

ఈ విషయంలో పట్టుగల దేనికి ? సంప్రదాయంపై గౌరవం ఉన్న వేములవారు కూడ ఛందస్సు విషయంలో ప్రయోగాలు జరిపారు. ఛందస్సు కావ్యకన్యకకు శృంఖలమా? సువర్ణ డోలికా? అనే విషయం కవి ప్రతిభపై ఆధారపడి ఉంటుంది. అలంకారా లనవసర మని మరో వాదన. గ్రీకు కవులు ముక్కుకు సూటిగానే గొప్ప సారస్వతం సృష్టించారు. కాని వారి ప్రధాన లక్షణకర్త Aristotle కూడా అలంకారానికి కవనంలో గల స్థానాన్ని గుర్తించాడు The greatest thing by far is to be a master of metaphor It is a sign of genius, అన్నాడు. నిత్య జీవితంలో మట్టుకు మనం ఉపమలు, ఉత్ప్రేక్షలు వాడటం లేదా ? అలంకారంలో కృత్రిమత్వం ఏమున్నది ? కవనం కృత్రిమం కాదా ? నాగరిక జీవనమే కృత్రిమత్వంతో కూడి ఉన్నది. కృత్రిమత్వం ఎక్కడ ఉన్నదంటే అదేపనిగా Baroque రచనలు సాగించి, దేవాలయ గోపురంపై కనిపించే శిల్పప్రదర్శనలా తయారు చేయడంలోనే

ఇంతకీ వచనకవిత్వ మంటే చెవి కోసుకొనే సాహిత్యాభిలాషులు కూడ వేములవారి కావ్యపరంపరను మెచ్చుకుంటా రనే నా అభిప్రాయం. వారి రచనాశిల్పం అలాంటిది. కవిత్వపు లోతులు తెలిసినవా దని ఊరికే అనిపించుకోలేరు. నన్నయ్య ప్రసన్నత, పోతన్న పదలాలిత్యం, సూరన్న వంటి ప్రాచీన కవుల ధారాశుద్ధి, విద్వత్కవులైన వేములవారి వృత్తాలలో వ్యక్తమవుతాయి. యతులు, ప్రాసలు, గణాలు ఉన్నాయో లేదో ఎవరి కెరుక ? శబ్దంపైనా, ఛందస్సు పైనా యింతటి పలుకుబడి ఉన్నా గారడీ రచనలకు వారు తలపెట్టలేదు వారి సమాస కల్పనకూడ ప్రశంసనీయమైనది. "నాకు తలంపు లేదు", యీ సంపుటిలోని "పున్నమి వెన్నె లూరెడి" వంటి పద్యాలు శ్రీనాథుని ఆణిముత్యాలతో తులతూగు తాయి. ఆ సమాసాలు నిజంగా ముత్యాలసరాలైనా వాటిలో కాఠిన్యం కనిపించదు. "వెన్నవలెన్ కరంగు" అనేటంతటి సులభగ్రాహ్యాలు.

ఇంతకీ ఛందస్సు కావ్యానికి అస్థిపంజరం మాత్రమే. రీతులు, వృత్తులు, అలంకారాలు శరీరశోభకు తోడ్పడవచ్చును. కాని కావ్యానికి జీవం కావ్యాత్మకదా? ఎంతసేపూ చిల్లర విషయాలపై చర్చలు సాగుతున్నాయే తప్ప ఆ ఐక్యవిషయాన్ని విస్మరించడం జరుగుతోంది. ఆధునిక కవిత్వానికి ఏవి అక్కర లేదో ఏకరవు పెట్టడం కంటె, కావలసిన విషయాలేవిటో తెలిస్తే సృజనాత్మకమైన కృషికి అవకాశం లభిస్తుంది. పూర్వపు అలంకారశాస్త్రాలు అసంతృప్తికరమని తోస్తే క్రొత్తవి సృష్టించవచ్చును కదా? అభ్యుదయకవులెవరూ యిందుకు పూనుకోవడంలేదు. అంటే నా ఉద్దేశ్యం సమగ్రమైన గ్రంథం యింకా వెలువడలేదు. వ్యాసాలు తప్పించి. ఛందస్సుపై పాశ్చాత్యదేశాలలో అనిష్టత కలగడానికి ప్రత్యేకకారణా లుండవచ్చును వారు ఉపయోగించే ఛందస్సులు తక్కువ. గణాలు యిరవై ఎనిమిదివాకా పుస్తకాల్లో ఉన్నా సామాన్యంగా వాడుతున్నవి తక్కువే. పైగా ఏకగణపాదాలకే ప్రాధాన్యత యిస్తారు. అస్తమానమూ 'వ' గణాన్ని వినీ వినీ విసుగుచెంది Whitman, Sandburg, John Perse వంటి కవులు free verse కి పూనుకొన్నారేమో? ఛందస్సుపై చర్చకన్నా నేటి సాహితీపరులను కలవర పెడుతున్న యితరవిషయాలు చాల ఉన్నాయి.

ఇటు వైజ్ఞానికశాస్త్రం, అటు మానసికశాస్త్రం వృద్ధిపొందుతూ, మానవ దృక్పథాన్నే మార్చివేస్తున్న రోజుల్లో, కవిత నిజంగా అవసరమా? ఏ రూపంలో ఉండాలనేదే సమస్య. విజ్ఞాన శాస్త్రానికీ, సంస్కృతికీ పొత్తు కుదరదని చాలమంది అపోహ. C. P. Snow రెండు Cultures ఉన్నా యన్నాడు. కాని Whitehead వంటివారే అలాంటి భయ మనవసర మన్నాడు. 30 సంవత్సరాలకు పూర్వమే వైజ్ఞానికదృష్టి కావ్యసృష్టికి ప్రతిబంధకమా? అని ప్రశ్నిస్తే, నిజంగా ఈ రోజే మహాకవులు తిరిగి వస్తే సైంటిస్టులుగా పనిచేస్తారని, షెల్లీ ఈ రోజుల్లో కెమిస్ట్రీ ప్రొఫెసర్ అయేవాడని జవాబిచ్చాడు. Einstein

అలాంటివాడే. ఈ మధ్యను అతని కవితకూడ ప్రచురితమైనది. అయితే కవిత్వంలో మార్పులు సహజం, అవసరంకూడా. ఇదే సందర్భంలో సాంప్రదాయాన్ని ఎంతవరకు అనుసరించాలని మరో ప్రశ్న. Eliot చెప్పినట్లు మహాకవు లందరి రచనల్లోనూ మనకు గోచరించే సామాన్య లక్షణం, మనం వారిని మెచ్చుకుందికి కారణం. అనిశ్చితమైన సాంప్రదాయ మనే ప్రత్యేక గుణాన్నే. దీనినుండే కావ్యానికి సార్వకాలీనత సంక్రమిస్తుంది. సాంప్రదాయాన్ని అనుసరించడమంటే గుడ్డిగా నకళ్ళు తయారుచేయడం కాదు. సంస్కృతియొక్క పరిణామానికి, అభివృద్ధికి జరిపే కృషిలో భాగస్వాములు కావడం. రాబోయే తరానికోసం క్రొత్త అంచాలు సృష్టించడం. వేమలవారి రచనల్లో యిలాంటి ఉదాత్తమైన సాంప్రదాయగుణం, సార్వకాలీనత కనిపడతాయి. సర్వకాలీనత కోసమని కవి సంఘానికి, సమకాలీనభావాలకు దూరంగా నిలవాలని నియమం లేదు. మహాకవులు సమకాలీన భావాలను, సాంఘిక పరిస్థితులను తమ రచనల్లో ధ్వనింప చేస్తారు. అయితే ఔచిత్యాన్ని పాటించాలి. రసాత్మకంగా వర్ణించాలి. కేవలం ప్రచారంక్రింద కనపడితే రచన రాణించదు. శ్రీనాథుని చాటువుల్లో, క్రీడాభిరామంలో రెడ్డిరాజుల యుగం, ఆ నాటి సాంఘిక జీవనం కళ్ళకు కట్టినట్లు చిత్రించబడింది. ఈ విధంగానే O'Neill నాటకాల్లో ఆధునిక సిద్ధాంతాలన్నీ చూచాయగా గోచరిస్తాయి. కాని Shaw మోస్తరుగా రచయిత మనకు పాఠాలు బోధిస్తున్నట్లనిపించదు.

ఈ విషయం ఆలోచిస్తే మరో సమస్య ఎదురవుతుంది. సాహిత్యానికి రథావస్తు వేమిటి? రాజకీయాలకు సాహిత్యానికీ అనుబంధం ఎలాంటిది? సాహిత్యానికి అసలు ప్రయోజనం ఏమిటి? అని చర్చించక తప్పదు. విశ్వశ్రేయం కోసం అంటే చాలదు. ఎవరి శ్రేయస్సు కోసం? సంఘంలో ఏ వర్గాలకు కవి అండగా నిలబడాలి? అని తేల్చాలి. మేము రాజకీయాలకు దూరంగా ఉంటాం. అలాంటి విషయాలకు మేము

అతీతుల మని దబాయిస్తారు కొందరు పెద్దలు. Aristotle సూత్రం ప్రకారం సంఘంలో ఏ ఒక్కరూ రాజకీయాల్లో తమపాత్ర నిర్వహించక తప్పదు. లేకపోతే విద్యార్థిదశలో భావకవిత్వం వ్రాసిన Karl Marx సామ్యవాదానికి గురుపీఠాన్ని ఎలా అలంకరించాడు ? అందుచేతనే రాజకీయాలు సాహిత్యంలో ప్రవేశించరాదనే పెద్దలంతా సమకాలీన సాంఘిక వ్యవస్థను పరోక్షంగా సమర్థించేవారే. సంఘంలోని మాలిన్యాన్ని, అక్రమాన్ని గుర్తించకపోవడం సంఘ వ్యవస్థ యథాతథంగా అట్టేపెట్టాలని ప్రాకులాడడం కొందరు రచయితల్లో కనపడుతుంది. కాని Legislators of mankind అనిపించుకొన్న మహాకవులు ధర్మాధర్మాలమధ్య నిరంతరం జరిగే సంగ్రామంలో ధర్మంకోసం, సంఘ సంస్కరణకోసం ప్రజానీకానికి అండగా నిలుస్తారు. వారిని ఉత్తేజపరుస్తారు. శ్రీ వేదులవారు అట్టి ప్రజాకవులు. అందుకే వారికి "నరపతి మెచ్చి యిచ్చెడి ధనంబులు, బిరుదాగ్రహార పరివార విసారాలు" కాక "సరసులు, పండితేంద్రులు, కళాజగతీ సహయాత్రికులు" చేసే మన్ననే యింపుగా ఉంటుందట.

వేదులవారి భాషా స్వరూపాన్నిగూర్చి నేను చర్చించ దలచుకోలేదు. Emerson చెప్పినట్లు భాషను సృష్టించేది కవులే. దాని పరిణామానికి, వికాసానికికూడ వారే బాధ్యులు. ఈ విషయంలో శల్యపరీక్ష నాకు రుచించదు.

వేదులవారి కవితా ప్రాశస్త్యాన్నిగూర్చి నాకు తోచినట్లు వివరించాను. వృత్తిరీత్యా రసాయనశాస్త్రజ్ఞుడనైన నాలో రసజ్ఞానం నేతిబీరకాయ సామ్యం కాకుంటే అదే పదివేలు.

మైసూరు,
1-2-1968

డాక్టరు శొంఠి సూర్యనారాయణరావు,
Ph. D., (హేంబర్గ్).

# విషయసూచిక


| | | | పేజీ |
|---|---|---|---|
| ముక్తఝరి | — | — | 1 |
| స్వప్నము | — | — | 7 |
| చరణధూళి | — | — | 13 |
| అంధగీతి | — | — | 19 |
| ఇంద్రచాపము | — | — | 22 |
| విహంగగీతి | — | — | 24 |
| మా తల్లి | — | — | 27 |
| ఆరాధన * | — | — | 30 |
| తుదిబేరము | — | — | 34 |
| తిరస్కారాధ్వరి | — | — | 36 |
| క్షేత్రము | — | — | 40 |
| సత్కారము * | — | — | 43 |
| కృతజ్ఞత * | — | — | 45 |
| సత్కృతి * | — | — | 47 |
| ముద్దాడ .... * | — | — | 49 |
| ప్రియ భారతావనీ ! | — | — | 54 |
| జయపతాక | — | — | 55 |
| శ్రావణి | — | — | 57 |
| మూడవ వసంతము | — | — | 60 |
| ఓ ప్రభూ ! | — | — | 63 |

| | | | పేజీ |
|---|---|---|---|
| ప్రార్థన | — | — | 65 |
| ప్రబోధము | — | — | 68 |
| సందేశము | — | — | 72 |
| పిలుపు | — | — | 73 |
| తెలుగుతల్లి | — | — | 79 |
| కుమారా ! | — | — | 81 |
| విశాలాంధ్రము | — | — | 83 |
| ఉగాది | — | — | 89 |
| జయారంభము | — | — | 92 |
| శార్వరి స్వాగతము | — | — | 95 |
| మా బాపూజీ | — | — | 99 |
| శ్రద్ధాంజలి : | — | — | 101 |
| మిత్రస్మృతి * | — | — | 104 |
| దీవన * | — | — | 110 |
| మనసా ! | — | — | 112 |

# ముక్తఝరి

కదలలే కేండ్లు పూండ్లు ఈ కటిక రాల
పాడు చెర నుండి నే డిటో బయట బడితి !
తేలిపోయి దుస్స్వప్నమ్ము తెలివిగన్న
నా యెడద పొంగుచున్న దానందజలధి !

పరవశపు కారుచీకటి తెర తొలంగి
కానబడె నాకు నిప్పు డక్కజపుసృష్టి !
అదిగో వెలు గదిగో నా ప్రాణపవన
మదిగో నా భూమి యదిగో నా యాకసమ్ము !

ఎంత శుభోదయ సమయ మ్మెంత మహోత్సవ మోహో !
ఎంత జగత్కోలాహల మెంత మహోత్సాహ మిపుడు !
హృదయ మ్మెరకలు గట్టుక - ఎగసిపోవు నెటకెటకో !
ఏ బంధము లేదిక నా కేనొక స్వేచ్ఛాజీవిని !

## ము క్త ఝ రి

నవ్వుచున్న యుషస్సతి నయనకాంతి
అలసిన యెడంద కమృతనిష్యంద మయ్యె !
సప్తరథ్యప్రయాణ హేషారవమ్ము
తోన మార్మోగె తూరుపుతూరుపెల్ల !

పసిడి తొలిసంజవెలుగు కన్పట్టె నిపుడు
నా కొరకు సత్యమైన స్వప్నమ్ము వోలె
ఇంత కాలానికి మేని కిప్పు డొదవె
వేయి కరముల కౌగిటి వెచ్చదనము !

చీకటినుండి బైటపడి, జిగ్గను వెల్తురు చూచినంత - ఈ
లోకము క్రొత్తదై-మనసులో మమతన్ గొలుపంగ-ఇంత కే
డో కలగాంచిలేచి దిగులొందెడు నట్లనుభూతదుర్దశా
వ్యాకుల జీవనస్మృతి హృదంతర మందిపు ఘౌఘుళించెడిన్.

భూమి కంపించినదియొ !
ఝంఝామరున్మహోద్యమము సాగి
ఉఱ్ఱూచి ఊడ్చినదియొ !
నన్ను బంధించియున్న మహోన్నతాద్రి
పిడు గడచినట్టు లామూలభిన్నమయ్యె !

## ముక్తఝరి

వదలె చిరతర శైలబంధము !
వదలె శంకాతంక భయములు !
వెలువడితి - ఆ క్షణమె స్వేచ్ఛా
నిలము మైసోకన్.

కోలుపోయిన హక్కు చేకొన్నయట్లు
మరచిపోయిన మార్గము దొరికినట్లు
జారిపోయిన మురళి చేకూరినట్లు
పాడిచె నాలో నెదో పాలకడలి పొంగు !

ప్రాకుల్ వట్టిన చిమ్మచీకటుల యా పాషాణకారాగుహా
ప్రాకారమ్ములటినంత - నా బ్రతుకుపై ప్రాభాతశోభామయా
శాకాంతిప్రసరమ్ము పాదుకొనె స్వేచ్ఛామారుతాహ్వాన గీ
తా కోలాహలమేదొ నాయెడద నుత్సాహమ్ములూగించెడిన్.

జగముల ముంచి యెత్తగల సత్తువగల్గి క్షుధాగ్నికీల లా
ర్పగను పిపాసదీర్పగను ప్రాణిచయమ్ములకెల్ల నెప్పు డే
డుగడగ నుండి యెల్ల కసటుల్ కడుగంగల దివ్యతీర్థమై
నెగడిన జాతి శక్తి గమనింప కెటుల్పడియుంటినో గదా !

# ముక్తఝరి

ఊపిరియాడనీని కఠినోపలబంధములో కలా కలా
లాపముగాని నర్తనవిలాసముగాని ధరాపరీమళా
వాపముగాని లేని పుటపాకపు చీకటి జీవితమ్ము నె
ట్లోపితినో గదా! అవలియొడ్డగుపింపని కాలమీదుచున్.

ఎన్నడు సోకునో తరగలెత్తగ శైమ్నగకమ్మయూర్పు నా
యున్నవమేన ఎన్నడు దయారుణరాగ మనోజ్ఞతల్ జగా
వన్నె పసిండిపూత చెలువమ్ముల నాపయి కుమ్మరించునో
యన్న తలంపె నా యుసురు నాపిన దాగిరి గర్భపుంజెరన్.

నావలె శైలబంధనమునంబడి స్రుక్కెడువారికెల్ల స్వేచ్ఛా
    విభవమ్మొసంగ నిక సాగరయాత్ర కుపక్రమింతు నా
త్రోవకు నడ్డమౌ గిరితతుల్ గహనమ్ములు ఛిన్నభిన్నమై
    పోవ,సమస్తలోక ముడివోవని శాంతిసుఖమ్ములందగన్.

ఏ యెడ - ఏ విధాన జనియించిననేమి ప్రపంచమెల్ల నా
దే యని స్వేచ్ఛగా పరుగులెత్తుచు సోదరసృష్టినెల్ల నా
ప్యాయత పల్కరించుచు ప్రియమ్మున గౌగిట జేర్చి జీవనో
పాయన మిచ్చుచుం దుడిచివైతు పురోగమనావరోధముల్.

## ముక్తఝరి

ఋషులు పాడిన వేదఋక్కులు వినిపించు
గంగాతరంగాలవీచికా స్వరమ్ము
నడకలో వేణుగానఘనహోయల్ పచరించు
యమునానదీతరంగమాల రవళి
ఆంధ్రభారతికి కావ్యాలాప మెరిగించు
గౌతమీ సరిదూర్మికారసమ్ము
కత్తి గంటముల కొక్కట నర్ఘ్యమిచ్చెడు
తుంగభద్రాధునీ భంగరవము
నా స్వతంత్రతరంగగానమున గలసి
గొంతు సవరింప ఈ చతురంతధాత్రి
దూరదూరాల తీరోపతీరములకు
మోసికొనిపోదు స్వేచ్ఛాప్రమోదవార్త!

ఈ పృథివీధూళి యింత సోకినయంత
నా మేన నవసుగంధమ్ము నెరయు
సంజల భాను తేజమ్ము పైబడినంత
నా యొడ లందచందములు గురియు
అనుకూలపవన మావంత తాకినయంత
నిలువున నామూర్తి పులకలూరయు
నింగి పల్వెన్నెల నీడలూరినయంత
నాలోన అలలగానమ్ము విరియు

## ముక్తఝరి

కడుపు చల్లని కార్మబ్బు పడతులిడు
దయారసము నన్ను పొంగులు వారజేయ
వార్ధిఘోషతో శ్రుతిగల్పి పాడెద నిక
దిక్కుదిక్కుల శాంతిసందేశ గీతి.

ఇదియది యనక కాలిడిన చోటులనెల్ల
పైరుపచ్చల పెంపు వారజేసి
చిన్న పెద్దనక నా చెంత కేతెంచిన
ప్రాణిసంతతుల పిపాస దీర్చి
అయిన గాకున్న మార్గాయాస ఖిన్నుల
శీతలానిలముల సేదదేర్చి
మొలక మోడనక నా కెలకుల పొడతెంచు
చెట్టుచేమల కింత జీవనమిడి
ఎండిబీడైన పొలములకెల్ల తడిపి
ఉమ్మలిక వోవ నవసుగంధమ్మొసంగి
హేలగా ఖేలగా మూలమూలలొరసి
విశ్వసృష్టి విచ్చలవిడి చరింతు!



# స్వప్నము

ఏ జాతి కా జాతి యీ నాడు గొంతెత్తి
శాంతిప్రచారమ్ము సలుపుచున్నది పైకి
కాని యేదో చిన్నగాలి ఏ మూల, ఏ
వేళ, మెలమెల్లగా వీచి ఝంఝానిలో
త్పాతమై యుద్ధజీమూత సందోహమ్ము
క్రమ్ముకొని రామె జగత్ ప్రళయమానోయంచు
లోలోన భయసంశయాలతో మతిపోయి
తినఁ దిండికై కట్టుకొన గుడ్డకై నవయు
ప్రజల నోళులుగొట్టి పసిడియంతయు బెట్టి
ఆయుధాగారమ్ములౌ పెద్దరాజ్యాల
నాశ్రయించుచున్న దణ్వస్త్రలబ్ధికై.

అంతరిక్షమ్ము నందణ్వస్త్రములు ప్రేలి
గాలిలో ధూళిలో, గలసమస్తమ్ములో
విలయానిలాభీల విషవాయువుల నింపి
భూతధాత్రినిగాల్చి బూదిరాశిగ జేసి

తొలిమానవుని నాట మొలిచి నానాటికిని
శాఖోపశాఖావిసారవిస్తారమై
మానవోత్తముల మేధానిదర్శనముగా
నిఖిల విశ్వమ్ముపై నీడలార్చెః నాగ
రకతా మహావృక్షరాజమ్ము నాశమై
అవని పెనువల్లకాడై పోవునో యని
పండితుండే కాదు, పామరుండే కాదు
రిక్తుడే కాదు ధాత్రీకుబేరుడే కాదు
అందరు ప్రాణాల నరచేత బెట్టుకొని
బ్రతుకుచున్నారీ ప్రపంచమ్ములో నేడు !

మానవుని దృప్తహృదయమ్ములోని తృష్ణ
దేవసింహాసనంబెక్కి తీర్చెఁ గొలువు
మతము ధర్మము తత్సభామందిరంబు
గుమ్మమును గాచు బ్రతుకు బత్తెమ్ము గోరి !

మూలబడిన పురాణఖడ్గాల దూసి
ఘాతికాచ్ఛన్నమై ప్రేమబాహ్యమైన
మతము పేరిట ధర్మమర్మములు గోసి
నర్తనముసేయు నేడు తృష్ణాపిశాచి !

# స్వప్నము

క్రౌంచుకోటల సుధాధార జాల్వారింప
జాలు బుద్ధుని యహింసాపథమ్ము
'ఉన్నది పరమాత్మ యొక్కటే! అన్నింటి
లో' అన్న శంకరు జ్ఞానపథము
పాపులకై శిల్వపై తన రక్తమ్ము
ధారవోసిన క్రీస్తు త్యాగపథము
కంచంపు పొత్తు చూపించి మహమ్మదు
ప్రవచించినట్టి సౌభ్రాత్రపథము

ఎన్నియో పథమ్ములుండుగాకేమి? నరుల
స్వార్థపరతను మాన్పగా జాలకుండె
ఒరుని నెత్తుటితో తన యుదరపూర్తి
సలుపుకొనుచున్నదిపుడు తృష్ణాపిశాచి.

భాసను బట్టి దేశమును బట్టి మతంబును బట్టి రంగు వ్య
త్యాసము బట్టి శత్రువుల యట్టులు మానవులెల్ల ద్వేషరో
షాసహనమ్ములం బెనగులాడెద రయ్యవి కృత్రిమంపు పై
వేసములంచు నెంచకురివెట్టు కొనంగ తెగింతురేలకో!

ఒక్క మహీజమందె విహగోత్కరముల్ తమ గూళ్ళలోన ఏ
చిక్కులపాలుగాక నివసించు పరస్పరమైత్రితో - మృగా
లొక్కట మందగా బ్రతుకుచుండు సమష్టిగ గాని, మానవుం
డక్కట! ప్రక్కవాని బ్రతుకార్పనె చూచు దయావిహీనతన్.

పులియు భుజంగియుం దమ బుభుక్షను దీర్చుకొనంగ సొంత బి
డ్డల దిగమ్రింగునట్టులకటా! విపరీతకిరాత శేముషీ
బలయుతజాతు లైహికపు ప్రాభవవైభవముల్ గడింప దు
ర్బలుల శిరమ్ములం దినుపపాదములూని చరింతు రుద్ధతిన్.

లేవడి పూటకేని గతిలేని యలంతుల పొట్టగొట్టి తృ
ష్ణావివశాత్ములౌ ధనసనాథుల పెట్టెలునింపు యంత్రమన్
దేవరరాజ్యమేలు ధరణీస్థలి కెన్నటికేని శాంతిల
క్ష్మీ విమలాంఘ్రిలాక్ష విలసిల్లెడు భాగ్యము ప్రాప్తమౌనొకో!

అని తలపోయుచున్ శయనమందు శరీరమువాల్చి జీవిత
మ్మున గల చింతలన్ మఱచిపోవగ జేసెడి గాఢనిద్రలో
మునిగిన నన్ను కార్తికపు బున్నమినాటి మహేశమౌళి క్రొ
న్నన వెలుగుం బరీమళమునం గరమేదొ స్పృశించె చల్లగన్.

# స్వప్నము

పూయని పూతలై తెరల పోలిక పర్వెన సాంద్రచంద్రికా
చ్ఛాయలనుండి డిగ్గిన హసన్ముఖుడొక్క-మహామహుండు నన్
డాయగవచ్చి తత్క-రమృణాళమునన్ స్పృశియించి నిద్దురం
బాయని నా కనుల్ తుడిచె స్వప్నకవాటము దీసినట్లుగన్.

లోక లోకాల శాంతి వెల్లువలు వారు
నతని మోమెన్నడో చూచినట్టులుండి
ఉపనిషత్సూన సకరంద ముట్టిపడెడు
అతని స్వరమెన్నడో వినినట్టులుండి
మోడ్పు గేల్వట్టి, యడుగుల మోకరించి
తడికనుల్, పులకించినయొడలు, వశము
తప్పిన యెడంద, తనియు శ్రోత్రములుగాగ
అతని వాక్సుధాధార గ్రోలితిని భక్తి!

" దేవళమీ సమస్తజగతీతల మంచెద నమ్మి, స్వార్థముం
బో విడి, సర్వభూతహితమున్ మతమంచు దలంచి, జాత్యహం
భావము మాని, మానవసమాజము సర్వమొకే కుటుంబమున్
భావనతో చరించిన, ప్రపంచము శాంతినికేతనమ్మగున్.

ఏ జాతియో దేశమేదియో ఏ వర్ణ
మో, మతంబేదియో పోనిమ్ము మనకేల

మనము మానవుల మీమహికి కామందులము
విశ్వపౌరుల యొక్క వృక్షమ్ము చివురులము
రావోయి ప్రియసోదరా! మానవోత్తమా!
రమ్మంచు హృత్కవాటమ్ము బారల తెరచి
ఆలింగనమ్ముతో ఆతిథేయమ్ముతో
మమతతో సమతతో మానవులు వర్తించు
నపుడే జగచ్ఛాంతి! అపుడే మనశ్శాంతి!

పేదకన్నుల నశ్రుబిందువొక టురలెనా
ఉదధు లేడీ యెడద నుప్పొంగిపోవలయు!
పుడమి ప్రాకెడి చిన్నిపురుగేని బడలెనా
ఊర్పుగాలుల విసరి ఉపచరింపగవలయు!
అపుడె జీవితశాంతి! అపుడే అమృతకాంతి!”
అని చెప్పుచునె మాయమై పోయె నా మూర్తి!

అంత మేల్కాంచి స్వప్నవృత్తాంత మెంచు
కొంచు నాలోన నేను తలంచుకొంటి
‘ స్వప్నమైనచో నిది మహాశ్చర్యకరము!
సత్యమైనచో నిది మహోత్సవ దినమ్ము!’

# చరణధూళి

భాస్కరుని తేరు దక్షిణాపథము విడిచి
కించిదుత్తరముగఁ బయనించు తఱిని
రాజగృహ నగరాంతరారామమునకు
బోధిసత్త్వుండు కరుణాపయోధి వచ్చె!

ఆకురాలిన మ్రోడులందు మ్రుక్కెడు జీవ
    కళ మంచుపడి, కనుల్ నులుముకొనియె!
చేమంతిపూల పరిమళమ్ములకు సం
    ధ్యావసాన సమీర మావులించె!
కుతిగొన్న పడుచు చకోరియు రేయెల్ల
    తడివెన్నెలకు మూతి ముడుచుకొనియె!
పడతి ముంగిట నెండపొడ సోకునందాక
    పడకిల్లు విడిచి రా బద్దకించె

పంటకళ్ళాన కాపున్న పడుచుకాపు
వగచె రేయెంతకును దెల్లవాఱదనుచు
మంచుముసుగు జీరాడ హేమంతరాత్రి
పెండ్లినడకల వయ్యాళి వెడలునపుడు !

వితతనిశాతుషారకణవృష్టి సముద్ధతిచే నుదగ్దిశా
గత తుహినాతతానిల విఘాతముచే నశియించెఁ బద్మ సం
తతి సకలమ్మెటో యొక సుదాముని పుష్కరిణిన్ దృగ
ద్భుతముగ నొక్కనీరజము పూచెను పండిన తేంట్ల భాగ్యమై !

ఆ విరిపోలికన్ వికచమౌ హృదయమ్మున తోటమాలి యా
పూవును గోసి యమ్మఁ గొనిపోయెను తత్పురవీథికంత లో
కావళి యయ్యకాల సముపాగత సౌరభ భాసురాంబుజం
బేవెలకైనగాని కొననెంచిరి యొండొరు త్రోపులాడుచున్.

రాత్రి గొట్టిన యీదరకు తప్పి ఈ సుంద
రాబ్జమబ్బుట భాగ్యమనియె నొకడు !
పురికి విచ్చేసిన బుద్ధదేవుని యర్ఘ్య
మున కర్హతమ మిది యనియె నొకడు !

బోధిసత్త్వుని జూడబోదు నీ కమల మూ
ల్యంబెంతయో చెప్పుమనియె నొకడు!
అర్హాతునకు పద్మమనిన నెంతో ప్రీతి!
అర్పింతు! నా కమ్ముమనియె నొకడు!

ఇట్టు లహమహమిక మీఱ నెల్ల వారు
పద్మమును గొన నారాటపడెడు నప్పు
డఖిల మంగళగీత వాద్యములు మ్రోయ
సపరివారంబుగా ధరాధిపవరుండు!

వనమున నున్న బుద్ధభగవానుని పూజకు వస్త్రమాల్య చం
దనకుసుమాక్షతాదుల యథావిధి గైకొని యాప్రసేన జి
జ్జనపతి బుద్ధదర్శనము సల్పగ బోవుచు నా చతుష్పథ
మ్మునగన చేతిలో వనజముంగొని నిల్చిన యా సుదామునిన్.

కాలముగాని కాలమున గల్గిన యీ జలజమ్ము గాంచి భూ
పాలకు డాత్రమద్భుతము పైకొన బల్కె సుదాముతోడ నో
మాలి! అకాలపుష్పితసుమమ్మునకున్ వెల దేల్చి చెప్పుమా
నైళమ యేను బుద్ధభగవచ్చరణార్చన కేగగా వలెన్.

అనిన నా మాలి హర్షాబ్ధి మునిగి తేలి
నళినమూల్యమ్ము నొక సువర్ణమ్ము చెప్ప
పది సువర్ణముల్ గొనుమని ప్రభువు పల్కె
ఇరువ దని గుంపులోనుండి యఱచె నొకడు!
ముప్పదని యేబదని పద్మమూల్య మిట్లు
పెంచుచు వివాదపడు ధరావిభుని, ప్రజల
నరసి యా మాలి ధనముపై నాస మాని
తలవని తలంపుగా వింత వెలుగుతోచి

'భూవిభుండాదిగా సేవకు వఱకు
సంపన్నుడాదిగా సామాన్యుదాక
ధనమెంత వ్యయమైన వెనుకాడబోక
కడగి పోటాపోటిగా వెలపెట్టి
ఎవ్వరికోసమై యేయర్థమెంచి
యీ తమ్మి కొనుటకై యెగబడుచుండి
రతనికి నేనే యీ యబ్జ మర్పించి
యా పరమార్థ మేలందగా రాదో!'
అనిమాలి తలపోసి హస్తముల్ మోడ్చి
'క్షమియింపుడీ మహాశయులార! నన్ను

సుమ మమ్ముగొనుట కిష్టములేదు నాకు '
అని బుద్ధుడుండిన యారామమునకు
పరిపూర్ణకాంక్షతో పయనమై పోయె!

అరుణాధరమ్ముపై విరియు సుందరమంద
హాసమ్ములో శాంతి మోసులెత్త
చంచదపాంగ వీక్షాంచల ద్యుతులలో
కరుణారసామృతఝరులు పొంగ
గంభీరవదన వికాసమ్ములో పరి
పూర్ణ ప్రబోధ విస్ఫూర్తి తోప
కావి గప్పిన మేని కమనీయ కాంతిలో
తాపమార్చెడి చల్లదనములొలయ!
తనువు గొన్న అహింసా సుధర్మ మట్లు
కరడుగట్టిన సత్యప్రకాశ మట్లు
క్షితితలాన పద్మాసనాసీనుడైన
బోధిసత్త్వుని గనె సుదాముడు క్షణమ్ము!

అనిమిషలోచనమ్ములు నిరారవ మొప్ప సుదాముడా మహా
త్ముని కరుణాప్రసన్నతర మూర్తికి సాగిలి మ్రొక్కి తాను దె
చ్చిన జలజాత మా సుగతు శ్రీచరణమ్ముల నుంచి జన్మమున్
తనువును ధన్యమైనటు లెదం దలపోయుచు నిల్చె భక్తితో.

## ముక్తఝరి

పున్నమి వెన్నెలూరెడి కపోలదరస్మిత కాంతిరేఖలో
స్విన్నదృగంత దంతురిత శీతల వీక్షణరోచిలో సుసం
పన్న కృపా సుధారసము పాయలు పాయలునై తథాగతుం
డున్న వనీలతాతరు సమూహము వింతవికాసముం గనెన్.

పాయని ప్రేమ బుద్ధభగవానుడు మోమొకయింత యెత్తినన్
దోయిని పాలవెల్లి సయిదోడగు హాసము మోసులెత్త 'వ
త్సా! యెది నీయభీష్ట'మనినంత సుదాముడెఱుంగరాని యే
దో యనుభూతి 'మీ చరణధూళి' యనెం బులకించిపోవుచున్.



# అంధగీతి

అంధభిక్షుకు డత డుదయంబు నుండి
సందె దాక యాతాయాత జనసమూహ
సంకులంబైన వీథివిటంక మందు
కంఠ మేకతారకు శ్రుతి గలిపి పాడు
చుండు గొంతెత్తి చెమ్మట లూడ్చుకొనుచు !

'కానబడ వేమి ! స్వామి నా కంటి' కన్న
యంధ కంఠ వినిర్గతార్తారవమ్ము
జనుల చెవి సోకు సదవకాశమ్ము లేమి
ఆతపానిలగర్భ మందణగిపోవు !

అతడు తనముందు పరచికొన్నట్టి చింకి
పాతపైఁ దారిబోవు కృపాళు లెవరొ
తోచినది పారవైచిపోవుదురు, కబోది
యెవ్వరేమిచ్చిరో పాప మెఱుగలేడు !

ఆ పథమ్మున నేఁబోయి నప్పుడెల్ల
అతడు కనిపించు, వినిపించు నతనిస్వరము
కాని, గ్రుడ్డివాఁ డను కనికరముఁదక్క
పాట భావమ్ము నా యెద నాటలేదు !

ప్రొద్దువాలిన తఱి సాగిపోవు నంధ
భిక్షుకుని పాట నేను విన్పించినంత
ఏ నిగూఢార్థమో స్ఫురియించి యెడద
యవశమై నిల్చిపోతి తదంతికమున.

గోకుల బృందావనీ కుంజవీథుల
        మారు మ్రోగిన మురళీరవమ్ము
ప్రాచీనతాపసాశ్రమ వాటికల నుండి
        నిర్గమించిన యౌపనిషద రవము
కాశికా గంగోత్రికా రస గర్భసూ
        ఆచార్యవరుల బోధారవమ్ము
శారదాపాద మంజీరమ్ములా కవీ
        శానుల సరసవాచారవమ్ము.

## అంధగీతి

అంధు మొఱతోడ బెరసి నా యాత్మ విరిసి
ఆ నఖశిఖమ్ము రక్తనాళాంతరాంత
రాల స్పందించి పెనుగాలివోలె రేగి
తూల్చివైచె నాహంకారధూళి నెల్ల !

చూడవలెనన్న కాంక్షతో పాడుకొనెడు
అంధునార్తారవమె సత్యమైన గీతి !
కన్నులుండియు చూడగా కాంక్ష లేని
యంధుడను నేనె నా పాటె యంధగీతి !



# ఇంద్రచాపము

బాల సూర్యుని యేడుగుఱ్ఱాల యరద
ముదయ సానూపలమ్ముల నొరయు నపుడె
యూడనిం బాడు చీకట్ల నీడలట్లు
క్రమ్ము క్కొన్నవి పడమట కార్మొయిళ్లు !

లోకబాంధవు కరము పైసోకినంత
మొయిలు మెయినిండ నవరత్నమయవిభూష
ణావళు లలంకరించుకొన్నట్లు నింగి
ఏడురంగుల సురచాప మెక్కువెట్టె !

నాకలోకమ్మునుండి సౌందర్యలక్ష్మి
మేదినికి దిగిరాగ నిర్మించినట్టి
చారుమణిమయ సోపాన సరణివోలె
అమరె నింద్రధనుస్సు మహాద్భుతముగ.

## ఇంద్రచాపము

విరిసె గాబోలు నాకాశ వీథిదాక
వనధిలోనుండి వరుణదేవుని కిరీట
రత్నకాంతులు భువనపర్యముగ నిపుడు
త్రిజగదేకసౌందర్య నిశ్రేణివోలె.

ఆకసమ్మున నుభయ సంధ్యాంతరముల
వివిధచిత్రవర్ణాకృతి విలసనమ్ము
లెన్నొ కనవచ్చు! నైన నా హృదయమునకు
సురధనుస్సేల యింత యచ్చెరువు గొలుపు!

చదల దోచు శక్రచాపమ్ము నా యెద
సురధనుస్సహస్ర శోభనింప
ఏబదేండ్ల ప్రాయమిట్టి బాల్యమ్ముగా
మారిపోయె! నేమి మనసా నాది!



# విహగగీతి

సొగసుల పుట్టవో యెగిరెడి పిట్ట!
దిగి రావె యొకమారు దివినుండి భువికి
జనులన్న భయమో యసహ్యమో నీకు
అడుగు సవ్వడి యింత యాలించినంత
అందాల నీ ఱెక్కలాడించు కొంచు
నెచటికో యెందుకో యెగిరి పోయెదవు
నిను వెంబడింప నా మనసౌను గాని
వాయు విమానంబునా యేమి నేను ?
అల యుషోదరహాస కలశవారాశి
వెలిదమ్మియై తూర్పు వికసించునపుడు
చెట్టుకొనకొమ్మ కెంజివురు జొంపాల
దాగి విప్పెదవు నీ రాగాల గొంతు
మాతృదేవతకంఠ మధుర స్వరమ్ము
నీ గొంతులో మారుమ్రోగునో యేమొ

మోదాన నుప్పొంగిపోవు నా యెడద
చవులూరు నీ పాట చెవి సోఁకినంత
నడిమింటి సంద్రానఁ బడవ చందాన
తీరైన ఱెక్కల తెరచాప లెత్తి
గాలికెరటాలలోఁ దేలి పోయెదవు
ఈ స్వేచ్ఛ యీ ధైర్య మెట్లబ్బె నీకు ?
ఎన్నున కెగసి పర్వెత్తెడి వేళ
ఏ యెండ కాచునో యే వాన పడునో
యే మౌదువో పాప మీ వంచు నేను
దిగులెత్తి మొగ మెత్తి వగతును గాని
బసలవు నీ తల్లి కడుపు చల్లనగ.
రేసఱ తల విరఁబోసి కొన్నపుడు
నీ తల్లి ఱెక్కల నీడలో నొదిగి
కుదురుగా నిద్ర వోయెదవు కాఁబోలు
పగట పూటనె కానబడుదు వెల్లపుడు ?
జీవితమ్మున చీకుచింతలు లేని
నీ హాయి యే మానిసికిని లేదాయె
ననుచింత నినుఁ జూచి నపుడు నా కొదవి

## ముక్తఝరి

యెంతయు మఱచి యే కొంత సేపైన
ఆడుచుఁ బాడుచు హాయిగా మింట
నీ వలె దిరుగాడ నే నెంతు గాని
లేవు ఱెక్కలు నాకు లేదు సాహసము
అందియందని జీవితావధులందు
పురుగట్లు నేలపైఁ దిరుగాడు నాకుఁ
ప్రాప్తించునా యంతపాటి భాగ్యమ్ము
కావున నో విహంగమ ! యొక్కమాట
పరులందరును స్వార్థపరులనుకొనక
పరహింసకలరెడి వారను కొనక
కవి హృదయాల రాగము శ్రుతిగల్ప
దిగి రావలయు నీవె దివినుండి భువికి !



# మా తల్లి

ఆ యుషో దేవతా నయనాబ్జ మధువు
లోలుకు నీ శైశిర ప్రభాతోదయమున
గుర్తు పట్టితి సంతాన కోటిఁగోడి
తల్లి వీవెపో! నా విశ్వధాత్రి వనుచు!

నీ కడ కాళ్ళు లందె హిమనిర్మల జీవనశాంతి నిర్ఝరుల్
నీ కడ కన్నులందె జననీ స్తనదుగ్ధ విముగ్ధ మాధురుల్
నాకు లభింప శైశవమునన్ నను వీడిన కన్నతల్లి పు
ణ్యాకృతి బోల్చుకొంటి భవదాకృతిలో నిపుడో కళావతీ!

నీ యమృత స్వరూప మెదనిల్చిన యంత గతానుభూతులున్
పోయిన పోకలుం దెమలిపోవని కాంక్షలు చింకిపాతలై
పాయగ, తల్లి వీవని భవచ్చరణమ్ముల మోకరించి య
మ్మా!యని పిల్చుకొంటి బహిరంతర శాంతిసుధల్ స్రవింపగన్.

## ముక్తఝరి

ఈ సచరాచర ప్రకృతికెల్ల రసైకవికాస జీవ మీ
వే! సతతక్షుధం బరితపించెడు పేదలపాలి యన్నపూ
ర్ణాసతి వీవె! దుర్బలుల రక్షణకై యభయప్రదానముం
జేసెడి శక్తి వీవె జననీ! భవదన్యము లేదు యేదియున్.

నీ దయ గల్గినన్ జరుగనేరని దేదియు లేదు తల్లి! పృ
థ్వీదయితుండు భిక్షువగు, భిక్షువు రాజ్యధురంధరుండగుం
గాదన కింక నీ వభయ కంకణ మూనుము నన్నుబోలు ని
ర్వేదుల పేదలం జిరనిపీడితులం గృపమై భరింపగన్.

సోదర శోణితమ్ములఁ జవిఁజూచెడి క్రూరులు, కార్మికప్రజా
స్వేదఫలమ్ములతో నినుపపెట్టెల నింపెడి నిర్దయుల్ మహో
న్మాద నిరంకుశుల్ దురభిమానులు నిండిన లోకమందు అ
స్మాదృశ దుర్బలప్రజల మన్పగ తల్లి! త్వదన్యమున్న దే!

ఆరని మంటగా బ్రతుకునందు రగుల్కొనుచున్న దొక్కటే
కోరిక, నీ కృపావనికి కోకిలనై కొనియాడుకొందు మం
దార సుమారుణ ద్యుతివితానము గొల్పెడి నీ మనోహరా
కారముతో మధూదయవికాసము నింపుము తల్లి! నా యెడన్.

## మా త ల్లి

ఏ యనుభూతి లేక రసమెండి వివర్ణత దోఁగి, వాసనల్
పోయిన నా హృదంబుజములో నొలికింపు మొకింత సర్వసం
ధాయకమైన నీ యడుగుదమ్ముల పుప్పొడితోడి తేనె త
ల్లి! యదె చాలు! నాకిక ఫలించును ప్రోవిడుకొన్న నాకలల్!



## ఆరాధన *

ఆమె నవనీతహృదయ, నా యంతరంగ
శాంతిదేవత, ఆశాపథాంతరాళ
పారిజాతమ్ము, ప్రేమజీవన విభాత
కైశికీగీతి, నా తపఃకల్పవల్లి !
ఆమె జగదీశమకుటాగ్రసీమ నుండి
యుర్విపై జారిన సుధామయూఖరేఖ,
ఆమె మూడు కాలాల కళ్యాణమునకు
అవతరించిన యొక పవిత్రానుభావ,
మామె నా జన్మ జన్మపుణ్యములు పండి
ప్రాప్తమైన పద్మాసీన భాగ్యలక్ష్మి
ఆమె పదసన్నిధాన దివ్యస్థలాన
భక్తి నమ్రుడనై నిలంబడిన యపుడు,
తలపునకువచ్చు, నా పేదతనము నాకు !

★ ★ ★

'చెలియ ! ఏ దేవి మంగళాశీస్సుమములు
పరిమళించినవో మన శిరములందు
ఒక తపస్సిద్ధివోలె నేటికి లభించె
నిరువురి మనోరథమ్ముల కేక ఫలము !'
అనిన, తారళ్యవిస్తారితాక్షి యగుచు,
'స్వామి, మనతోటలో నీ వసంతవేళ
పూచిన సుమమ్ములా దేవి పూజకొరకె ! '
అనుచు, నా చేయి తనచేత నదుముకొన్న
యామె పదసన్నిధాన దివ్యస్థలాన
నాక కల్లోలినీ పదన్యాసమునకు
దరవినతమైన హరజటాభరమువోలె,
నతుడనయ్యె, మహామహోన్నతి వహింతు !

★ ★ ★

మాతృదేవతా కళ్యాణమందిరమ్ము
ద్వారమున అడ్డుపెట్టు పూజారి లేదు
లేదు బంధమ్ము లేదు నిర్బంధ మిపుడు
నేల నాలుగు చెరగుల నిఖిలశృంఖ
లా విమోచనోత్సవ సముల్లాస మలమె

ఇంక భయమేల సంశయమేల మనకు
రమ్ము ప్రేయసీ! శుభముహూర్తమ్ము దాట-
కుండ నుభయ జీవితకాంక్షలొకటిజేసి
నాల్గుచేతుల మ్రొక్కుకొందము సవిత్రి
శ్రీచరణముల కాశయ సిద్ధి కోస
మనిన, ఆనందవిస్తారితాయతాక్షి
యగుచు కేల్దోయి నాగళమందు పూల
మాలగా జేసి యుత్సాహమగ్నయైన
ఆమె పదసన్నిధాన దివ్యస్థలాన
పదియు నాల్గేండ్ల పాటి యౌవన సుషుప్తి
తేలిపోయిన యూర్మిళాదేవి మ్రోల
ప్రణయ వినమితుడైన లక్ష్మణుడు వోలె
ధన్యహృదయ రాజ్యాధిపత్యము వహింతు.

★ ★ ★

పాలకడలిని శేషతల్పమ్ముమీద
యోగనిద్రలోనుండి యధోక్షజుండు
మేలుకొని విప్రయోగ భారాలసుడయి
కార్తికజ్యోత్స్న తన కడకు వచ్చు

కాలమున హర్షసంభరాంగోలి యగుచు
శ్రీతులసిచెంత వేదికాసీన యగుచు
"నన్ను పాలింప నా ప్రాణనాథ! నడచి
యరుగుదెంచితే" యనెడు త్యాగయ్యకృతిని
మ్రోగునది తంత్రియో గళమ్మో యెఱుంగ
రాని యట్టుల శ్రావ్యస్వరమ్ముతోడ
వీణపై తన్మయత నాలపించు చున్న
ఆమె పదసన్నిధాన దివ్యస్థలాన
అద్భుతానందపారవశ్యమ్ము తోడ
పాట వినుచును నే నిలంబడినయపుడు
శారదాకరుణాకటాక్షమ్ము గన్న
చిర దరిద్రుని ప్రజ్ఞావిశేష మట్లు
సభ్యతాపూర్ణ సౌమనస్యమ్ము గాంతు.

★ ★ ★

* ఇది అముద్రితకావ్యము. దానిలోని ఖండికలివి.

# తుదిబేరము

"ఎవరు కొంటారో! నా వెవరు కొంటారో"
అని కేకలిడుచు రేయనక పగలనక
వాడవాడల తిరుగులాడుచు నుంటి!

చేరవచ్చు నొకండు! చిఱునవ్వొకడు నవ్వు!
వగ తోపగా - ఎగాదిగ చూచు నొక్కండు!

తల మీది సరకుల తట్ట బరువగుచుండె!
ఇట్టులే గడచునో యేమొ నా రోజెల్ల!

రాలతో గట్టిన రాజమార్గము నందు
బరువెత్తుకొని పగలు తిరుగాడుచుండ
తల కిరీటము వెట్టి తరవారి చేబట్టి
పైడితేరెక్కి భూపతి వచ్చి నన్నాపి
అనియె "నా శక్తితో కొనియెద నిన్ను"
"మించిన లొంగు బల్మికి లెక్క యేమి?"
అనినంత రాజు వచ్చినదారి బట్టె!

## తుదిబేరము

వీథితలుపులు మూసివేసిన సందులో
చనుచుండగా వృద్ధధనికు డొక్కడు
వాకిలి తెఱచి గుభాలున వచ్చి
యోచించి యనె "పైడియొసగి కొందును నిన్ను !"
'నిలువని ముల్లె నిష్ఫల' మన్న తలపుతో
బరువెత్తుకొని నేను మరలితి నెటకో !

వృక్షాగ్రముల సంజవెలుగు పూచినవేళ
వకుళవాటిక నుండి వచ్చి సుందరి యొకతె
అనియె 'నా నవ్వుతో కొనెదను నిన్ను'
'లేనవ్వు కన్నీట లీనమగు తుది' కన్న
చాన క్రమ్మరి వనచ్ఛాయాంతరిత యయ్యె !

నెఱసంజ యలల బంగరుముగ్గు లిడువేళ
సాగరతీరాన సైకతవేదిపై
ఆలిచిప్పలతోడ ఆడుకొను పసిపాప
నన్నెఱిగి యున్నట్లు నా దరికి చనుదెంచి
'ఏమీయకయే నిన్ను నేకొందు' ననియె !

ఆటకు నేనిట్టి అమ్మడై పోతి
తలమీద భారమంతయు తీరిపోయె !

[రవీంద్రనాథ ఠాకూరు]

# తిక్కనాధ్వరి

మానవజన్మ మెత్తిన రమాపతి వ్యాసమహర్షి భారతా
ఖ్యానము సెప్పలేమి ఘన; మా మనుమ ప్రభురాజ్యచక్రమీ
వై నడపించు చంతటి మహాకృతి వాక్పతిమౌళి భూషణం
బౌనటు తెల్గుసేతయె మహత్త్వము నీయదిగాక తిక్కనా !

వ్యాసుని భారతాగమము నందలి పాత్రలనెల్ల వేషభా
షా సుచరిత్రలం దెలుగుజాతిహొయల్ మెఱయంగ దీర్చి కై
సేసినయట్టి నీ తెలుఁగు సేతకు బంగరుపూల పూజలం
జేసియు తీర్చికోఁగలమె నీ ఋణ మెన్నితరాల కేనియున్.

హరిహరనాథు దేవనిలయమ్మును మన్మనృపాలచంద్రు రా
చరికపు పేర్మియున్ విధివశమ్మున రూపఱిపోయియున్ భవ
ద్విరచితకావ్య శిల్పజగతిన్ వెలుగొందుచు నేటికిన్ బరా
బరు లొనరించుఁ బో తెలుగువారల తొల్లిటికీర్తిమూర్తికిన్.

# తిక్కనాధ్వరి

కెందమ్మి చూలి వెడంద మోముల నా
    ల్గిటను మ్రోగు వేదనిఃస్వనము వోలె
నటరాజు జడముడి నడుమ త్రుళ్ళిసలాడు
    చదలేటి కెరటాల రొదలు వోలె
శర్వాణి పాపట జాబిల్లి దొరగు సు
    ధాశీకరముల నాదమ్ము వోలె
వాణీకరాంగుళీవాదిత కచ్ఛపీ
    సామగానైక మూర్ఛనము వోలె

శక్తి గంభీరరక్తి రసప్రసక్తి
మార్దవమ్మొప్ప భారతామ్నాయ మాంధ్ర
దేవి కుడుగర యిడిన పుంభావవాణి
వోయి తిక్కన! ఎంత ధన్యుడవో నీవు!

జన్నమొనర్చి వేల్పులను సంతతసత్కృతులం బొనర్చి వి
ద్వన్నిచయమ్ము భారతకథారచనా రమణీయ కావ్య శి
ల్పోన్నతిఁ దెల్గులం దనుప నోపిన పుత్రుని నిన్నుగన్న యా
యన్నమ కొమ్మనల్ సలిపినట్టి మహాసుకృతమ్ము లెట్టివో!

ఆ మనుమ క్షితీశు సచివాగ్రణివై అలనాడు సత్కవి
స్తోమము దన్పి మన్పుటొక చోద్యమె? నేడును దెల్గుకైతపై
ప్రేమ గలట్టి సింహానగరిన్ జరిపింతువు మన్ననల్ త్వదా
ఖ్యామహిమన్ మహాకవిచయమ్ముల కెట్టి యదృష్టమూర్తివో!

ఆనాటి యాంధ్రభూజానుల పెంపు భా
రతవంశరాజ వర్ణనములందు
అలనాటి యాంధ్రయోధుల పరాక్రమరేఖ
భారతవీర విహారమందు
ఆనాటి యాంధ్రప్రధానుల రాణ్ణీతి
భారతమ్మున రాయబారులందు
అలనాటి యాంధ్రదేశైశ్వర్య గరిమ భా
రతరాజ్య విభవ గౌరవము నందు

నాటి యాంధ్రాంగనాభిమానమ్ము కలిమి
భారతీసతి మహాప్రభావమ్ము నందు
మూర్తి గొనునట్లు భారతమ్మును రచింప
నొక్క నీకు గాకింక నన్యులకు దరమె?

## తి క్క నా ధ్వ రి

నన్నయ తెల్గుతోటకయి నాటిన భారతచూతశాఖ నీ
పన్నిన కావ్యకుంజముల బాసట వాఙ్మయనందనమ్ముగా
నన్నిట నాటినేట కవితాధ్వగులం దనియించు సత్కళా
భ్యున్నతి నిత్యనూతన మహోదయముల్ తెలిగించుచుండెబో!

నెల్లూరిలో తిక్కన జయంతి సందర్భమున సత్కారసభలో చెప్పినవి.



# క్షేత్రయ్య

గోపబాలుని పిల్ల కూకటిముడి నూగు
నెమలి పించెంపు వన్నియల హొయలు
తీయని వాని వాతెర కమ్మయూర్పుల
గ్రోల్చెడు పిల్లన గ్రోవి పాట
నట్టాడువాని చిన్నారి పాదముల బం
గారు గజ్జెల ఘులంఘులల రవళి
మనసైనవాని ప్రేమకుఁ జొక్కు ప్రేఁతల
కొమరుప్రాయపు చిట్టికముల గుట్టు

ఫణితులై పాటలై తాళభావములయి
మువ్వగోపాలు రసికుల మ్రోల నిలుపు
పదములల్లిన రసరాజ్య పట్టభద్రు
క్షేత్రయ నుతింతు ఆంధ్ర వాగ్గేయకారు.

రత్నకాంతుల నంబరమ్ము చిత్ర మొనర్చ
హిమవన్నగౌన్నత్య మెంచినపుడు
నవ్యో నాట్యమొ దిగంతముల పాతులు దొక్క
అంభోధి గాంభీర్య మరసినపుడు
పూఁతమోచిన తీవ పొదరింట్ల పిల్లతె
మ్మెరల కమ్మఁదనమ్ము పొరసినపుడు
శరదవకుంఠనాంచలములో కార్తిక
జ్యోత్స్నల చలువమై సోఁకినపుడు

గొల్లభామల శృంగారమ్ము కొల్లగొన్న
లీలతో నీ పదమ్ము లాలించి నపుడు
నా హృదయ మొక్కరీతి ఆనందమొందు
క్షేత్రయ్యా! రససిద్ధ వాగ్గేయ కార!

ఒక వేశ్యాంగనతోడి భౌతికపు భోగోద్యోగమే నీ పదా
ళికి నాలంబనమేని సత్యకవితాలీలావతారంబ వీ
వకలంకంబగు కృష్ణభక్తిరసమే యాలంబనంబైన నిం
తకు నీ వప్పటి రాధికాసతివో చైతన్యుండవో కావలెన్.

## ముక్తఝరి

రసికత చచ్చి భక్తిమధురత్వ మెఱుంగక నృత్తగీత సా
ధ్యసులగు సాము లయ్యదువతంసునికై తపియించిపోవు ప్రే
యసి వయి నీవు పాడిన రసార్ద్రపదమ్ము లసభ్యతామలీ
మసముల టందు రెంత కసుమాలపు కాలము దాపురించెనో ?

ఉన్నదో లేదో తిక్కన్నలో నీ జాను
తెనుఁగుమాటల కూర్పు తేటదనము
ఏమున్నదో పోతనామాత్యులో నీదు
భక్తి మాధుర్యంపు బరవసమ్ము
సవతోకో జయదేవకవి నీ నిసర్గాత్మ
శృంగారరసభావ చిత్రణమున
అగునో కాదో యన్నమయ్యలో నీ దేశి
మట్ల రాగ లయ ప్రమా సమాధి

కవివి గాయకుడవు భక్తుడవు నటుండ
వోయి రసమూర్తి యేమి కానోప వీవు
మువ్వగోపాలు కెమ్మోవి మురళి వీవు
శారదా పాద నాట్యమంజీర మీవు.

# సత్కారము *

ఓ గాయకోత్తమా ! ఓ కళావిత్తమా !
  ఏది ! వాయింపు స్వామీ ! వాయులీనమ్ము
నీ వాయులీనతంత్రీ నిస్వనములలో
  ఈ విశ్వగాన సుధా వేణికల్వొరియ—

నారదుని మహతీనినాదముల్ పలికించు
  భారతీకరకచ్ఛపీరాగసుధ నించు
నీ వాయులీన తంత్రీవాద మాధురులు
  పృథివిపై నవచైత్ర రథము లాకల్పించు—

నీ కేలుదమ్మి వాణీస్తన్యమందెనో
  నీ యంగుళుల పూకిరో యచ్చరలు సుధల్
స్వరములో భావసాగరములో భావని
  ర్ఘరములో ప్రాణముల్ ఘుటిపింతు, మఱపింతు—

## ము క్త యు రి

వెలది వెన్నెలబాలికల కౌగిలింతలో
మలయానిలుని యూర్పు టలల గిలిగింతలో
పడతి పెన్నెరుల సాంబ్రాణిపొగ తావులో
నీ వాయులీన తంత్రీరసామృతములో—

గోపాలు పిల్లనగ్రోవి యూదిన హోయి
నీ వాయులీనతంత్రీతాన మే నోయి!
తెలుగుగాణల యశోలలన నెన్నుదుటి శ్రీ
తిలకమ్ముగ వంకలొ త్తినదోయి నీ చేయి—

---

* చెన్నపురిలో 2—4—49 తేదీని కీ॥ శే॥ శ్రీద్వారము వెంకటస్వామి నాయుడుగారికి జరిగిన సన్మానము సందర్భమున చెప్పినది.



# కృతజ్ఞత*

నా నడ తెంచు త్రోవ సుమనః ప్రతతుల్ వికసించి సౌరభా
హ్వానమొనర్ప వాఙ్మయసహవ్రతు లిచ్చు శుభాశిషప్రశం
సానినదాలతో మఱువజాలని మన్నన జేసినట్టి హే
లానగరీ రసజ్ఞుల కళారతి నామతి బాయదెన్నడున్.

ఈ నవసాహితీ పరిషదిందిర నా మెడ వైచినట్టి స
న్మానలతాంతమాల యభినందన సుందర సౌరభోత్సవం
బా నిధనంబు నా బ్రతుకునందు గుబులొక్కన జేసి సత్కవీ
శానులు గాంచు స్వప్నముల సత్యవికాసము నా కొసంగుతన్.

నరపతి మెచ్చి యిచ్చెడు ధనంబులుగాని మణీవిభూషణాం
బరబిరుదాగ్రహార పరివార విసారముగాని, నా కిటుల్
సరసులు పండితేంద్రులు కళాజగతీసహయాత్రికుల్ మహో
దరమున జేయు మన్నన విధంబున నింపును బెంపు నింపునే!

కవులెపుడున్నిరంకుశులె గాని రసజ్ఞులు మెచ్చియిచ్చు గౌ
రవ మెడబెట్టునంతటి విరక్తులుమాత్రముగామి నే సదా
శివమకు బొందు చంద్రికకు జేరు చకోరమువోలె నిమ్మహో
త్సవమున కాసజేసితిని దైవిక జన్మఫలైక సిద్ధిగన్.

---

* ఏలూరులో నవ్యసాహిత్యపరిషత్తు వారు సన్మానించినపుడు మహాసభలో చెప్పిన పద్యములు.



# సత్కృతి *

పుట్టిన దేశమంచు, రఘుపుంగవు సన్నిధియంచు, నాదరం
బుట్టిపడం బ్రజల్ సలుపుచుండిన గౌరవమంచు, యోగ్యులై
నట్టి సభాసదుల్ గలిగిరంచు సుహృత్ప్రియకార్యమంచు ని
ష్పట్టున సమ్ముదంపడితి పౌరుల సత్కృతి కీసదస్సునన్.

నీ పదధూళిసోకి రమణీత్వము నందదె రాయి, పాదుకా
రూపమునన్ భవత్పదసరోరుహసేవ యొనర్చి దారు వు
ర్వీపరిపాలనంబు నొనరింపదె! అట్టె లభించె నాకు నీ
ప్రాపున జేసియే రఘువరా! యిటుసత్కృతి భాగ్యయోగ్యతల్.

ఏ యెడనున్న నే సభలకేగిన గౌరవమొప్ప శాస్త్రివ
ర్యా! యని కేలుమోడ్చి వినయమ్మును జూపెడువారెగాని ‘ఏ
మోయి!’ యటంచుపిల్చిచనవొప్ప భలోక్తులముచ్చటించునా
త్మీయులు కానరాని వగదీర్చినదీ సభ నాకు నేటికిన్.

## ముక్తఝరి

జయపురీ విక్రమేశ్వరుడు కైతకు మెచ్చి
నిండోలగమున మన్నించునాడు
తెరువెల్ల పూవుల పఱపుపై నడపించి
విద్వత్కవుల్ గౌరవించునాడు
గురుదేవుడెద మెచ్చుకొని 'మహాకవి!' యన్న
బిరుదమొసంగి దీవించునాడు
మించు పేర్మి 'గౌతమీ కోకిలా' యని
యావదాంధ్రమ్ము కొండాడునాడు

డెందమున గ్రందుకొన్న యానందచంద్రి
కావికాస మహోత్సవ కలన కన్న
'నా' యనెడివారి యాదరోపాయనమ్మె
అద్భుతామోద దాయకం బయ్యె నేడు !

ఎందరెందరో గలరు నా కేకలవ్య
శిష్యు లద్భుతకవితా విశేషమతులు
కాని సూర్యనారాయణకవి యొకండె
ఋణము తీర్చిన శిష్యవరేణ్యుడయ్యె.

---

* నేను పుట్టిపెరిగిన భద్రాచలములో పౌరులు సన్మానించిన సందర్భమున చెప్పిన పద్యములివి.

ముద్దాడ……. *

శ్రీరంజిల్ల నిజాంఘ్రిపద్మముల సంసేవించు పుణ్యంబుచే
దారూఢంచిత పాదుకాద్వయి కయోధ్యారాజ్యపట్టంబు చే
కూరం జేసిన జానకీవిభుఁడొసంగుంగాత ! ముద్దాడవం
శారామంబునకున్ మహోదయవికాసానేక సౌభాగ్యముల్ !

శ్రీయును వాణియున్ చివురుఁజేతుల చామరలూని నెమ్మదిన్
బాయని భక్తితోడ నిరువంకల సేవలొనర్పగా శివా
ర్ధాయితమూర్తియై శుభపరంపర లిచ్చి జగంబులేలు కా
త్యాయిని ప్రోచుగాత! సకలార్థములిచ్చుచు లచ్చునాయనిన్.

అమితౌదార్యము నెంచి భూజనము ముద్దాడంగ మీ వంశనా
మము ముద్దాడగ నయ్యె! మీ కులమునన్ మాన్యుల్
కృతీశుల్ రసా
ర్ద్రమనస్కుల్ గురుదైవభక్తినిరతుల్ దాతృత్వరాధేయు లు
త్తమచారిత్రులు పుట్టుటబ్బురమె! ముద్దాడాన్వయోద్ధారకా!

పలుకుం బంతము లోకక్కై తనర సద్భావంబు తోడం బ్రజా
వళియెల్లం దన యాజ్ఞ నౌదల ధరింపన్ వంశధారా నదీ
సలిల శ్యామల భూమికంతకును భూజానింబలెన్ వేంకట
ప్పలనాయుం డొనరించె పెత్తనము విభ్రాజద్ యశస్సాంద్రుడై.

అధికారినైన ధరాధినాయకునైన
  సరిదిద్దగల చండశాసనుండు
ఆరునూరైన నూరారైన మాట
  తప్పనియట్టి న్యాయైకవర్తనుండు
వేదశాస్త్రపురాణవిదులకు కవుల కా
  శ్రయమిచ్చి మనిచిన సహృదయుండు
స్వపర భేదము తలంపక అర్థులకు నెల్ల
  సాయమ్మొనర్చిన సౌమ్యమూర్తి

బంకుపల్లె మల్లయశాస్త్రి వర్యుచేత
యక్షగానమ్ము కృతినొంది యశముగన్న
వేంకటప్పల నాయని పేరు జెప్పి
మఱియొకరి జెప్పవలయు నీ మండలమున.

## ముద్దార

కవు లాంధ్రంబున నెందరో గలరు సత్కారార్హులై నన్ కళా
ప్రవణంబౌ భవదాదరంబొదవె నాపై దానికై కైక హే
తువు మా మామయు బంకుపల్లె విబుధేంద్రుండైన మల్లయశా
స్త్రివరున్ మన్నన సేయు మీ జనకు నిస్సీమాభిమానంబె పో!

కులమోజాతియొ ప్రాంతమో మతమొ సాకుంజేసి సాహిత్యమున్
విలువల్ గట్టెడు కాలమందు కవితావిద్యావిశేషజ్ఞతా
కలితాంతఃకరణున్ నినుం గనుటచే గల్గెన్ మహానందమే
వలనన్ సత్కవికంతకన్న గలదే! భాగ్యంబు కీర్తిప్రియా!

ఎచటి కావ, లెచటి యీదుల వలస! యె
ట్లొదవె స్నేహము మన యుభయులకును
కలసికొందు రిట్లె కవియు రసజ్ఞుండు
ఉదధి లవణ మడవి యుసిరికట్లు.

కవినంచున్ నను సత్కరించుటొకటే కాదయ్య! ఏటేట శా
స్త్రవిశేషజ్ఞుల కెంతమందికొ మహాసత్కారముం జేయు నీ
వ్యవసాయమ్ముఁ దలంచి దానపరుఁడౌ ఆ తండ్రికిం దగ్గ ప
ట్టివినీవంచు ప్రియమ్మునై పొగడుచుంటిన్నిన్ను విద్వత్ప్రియా!

స్థాపింప నుంటివి తండ్రిపేరిట జగత్
ప్రఖ్యాతముగ వేదపాఠశాల
పంచాంగ మేటేట పత్నిపేరిట
ప్రచురింప వార్షిక మేర్పరించితీవు
ఆనువాయితి తప్పకర్పించుచుంటివి
వర్షాశనమ్ము విద్వాంసులకును
చేయగల్గిన ప్రజాసేవతో వెలమ
జాతియశమ్మునకు వన్నెదెచ్చితీవు !
పరము పదము గొన్న పత్ని సీతారామ
మాంబ మీది ప్రేమ మాత్మ నిల్పి
నిండుబ్రతుకు గడపుచుండిన ప్రణయివి
లక్ష్మణాఖ్య సత్కళా తపస్వి !

ఏ యెడ కవులకు నడుగం
బోయిన లేదనెడు కాలమున కోరక ము
న్నేయిడు సరసుడు ! లచ్చ
న్నాయని యౌదార్య మింతనందరమే !

శ్రీయుతు డుత్తమగుణ వి
ద్యాయుక్తుడు విజయవేంకటప్పల నాయం
డాయుష్మంతుడు మీ జా
తీయోన్నతికిన్ యశంబు దేగల డింకన్.

★ ★ ★

## ము ద్దా డ

వంశధారా మహావాహినీ వీచికాం

తర్లీన మగు చల్లదనము కొంత

నాగావళీ సరిద్యోగానుకూలాని

లమ్ముల మెత్తందనమ్ము కొంత

శ్రీకూర్మనాథ గళాకల్ప కల్పక

ప్రసవమాలికల సౌరభము కొంత

ముఖలింగ శివజటా ముకుటార్ధ చంద్ర సు

ధాసారముల తీయదనము కొంత

నీ యెడద నచ్చువడిన జాతీయతకును

దేశభక్తికి ప్రేమ కుద్దీపనములు

గాగ, శ్రీకాకుళమునకు గర్వహేతు

వగు యశము గాంచి వర్ధిల్లు మయ్య నీవు.

9—6—'63

---

* శ్రీముద్దాడ లచ్చున్నాయుడుగారు శ్రీకాకుళంజిల్లాలోని ఈదులవలస గ్రామనివాసులు. సాహితీప్రియులు. మహోదారులు. విద్వత్కవి పోషకులు. వారు నన్ను తమ గ్రామమునకు రప్పించి మహాసభలో "మూడెకరముల భూమి అన్నిహక్కులతో మీ పేర వ్రాసి దానిపైవచ్చు ఆదాయము మూడువందల రూప్యములు మీకు ఇచ్చెద" నని చెప్పి భూరిసత్కారము చేసినారు. ఆ సందర్భమున చెప్పిన పద్యములు.

# ప్రియ భారతావనీ!

ప్రియభారతావనీ! విశ్వైకపావనీ!
జయశాలినీ! మమ్ము దయజూడుమా జనని!

తెగలు తెగలై చీలి వగచు నీ సంతతిని
తెగని స్నేహమున బంధించి ఏకము జేసి ॥ప్రియ॥

కలుషితాచారముల కులజాతి మత ద్వేష
ములబాపి నీ సేవ సలుపు భాగ్యంబిచ్చి ॥ప్రియ॥

చెలిమితో జాతీయ బలముతో వైభవో
జ్జ్వల జీవనమ్ముతో విలసిల్ల దీవించి ॥ప్రియ॥

విలసద్యశమ్ము దిక్కులనిండ ఆసిమూ
తలమానికమ్ముగా నిలుప నీ కేతనము ॥ప్రియ॥



# జయ పతాక

పవిత్రభారత సవిత్రి కోహో
స్వతంత్రోత్సవం సాగింది
లాల్ ఖిల్లాపై అశోక చక్రపు
త్రివర్ణ కేతన మెగిరింది ॥ప॥

మతం తలవక గతం తడవక
ద్వేషం రోషం సకలం మరచి
స్వతంత్రభారత జయ పతాకకు
సోదరులారా! మ్రొక్కండీ ॥ప॥

నెత్తురు లోడ్చిన సత్తువ లూడ్చిన
పిశాచ దాస్యం నశించిందని
ప్రపంచమంతా ప్రతిధ్వనింపగ
స్వతంత్ర శంఖా లూదండీ ॥ప॥

ము క్త యు రి

పోరుల గ్రమందిన కారల కుందిన
స్వతంత్రయోధుల స్మరించుకొంటూ
ముదగ్రశు తర్పణ హృదంబుజార్పణ
సోదరులారా ! చేయండి. ॥ప॥

అమోఘ శక్తుల సమీకరించుక
సమస్త భారత సమైక్య మెంచుక
హిమాద్రి మొదలుగ కుమారి వరకు
భారత విజయం పాడండి. ॥ప॥

---

[1947 ఆగష్టు 15 రాత్రి 12 గం॥లకు పేరూరులో రచించి చదివినది.]



# శ్రావణి

నోములు నోచిన భామల్లారా!
వ్రతాలు పట్టిన వనితల్లారా!
పుణ్యము పండిన పురంధ్రులారా!
పేరంటానికి రారండమ్మా!

గుమ్మడి పూవులు కొప్పున తురిమి
కడిమిమొగ్గసర మెడదను దాల్చి
మొగలి పుప్పొడిని మొగమున పూసి
బుట్టమాలతిని బొట్టు పెట్టుకొని
నీలిక్రొమ్మొగిలు మేలి ముసుగులో
మెఱుపుల సొమ్ములు మిలమిల మెఱియగ
దారివెంట ముత్యాలు గురియగా
వెలుగులు నీడలు మడుగు లొత్తగా
ఇన్నూఱేండ్లకు ఈనాడిదిగో
భారతమహిళల భాగ్యలక్ష్మిగా

## ము క్తి ఝ రి

స్వాతంత్ర్యశ్రీ సహచారిణిగా
వచ్చెను మన శ్రావణ వరలక్ష్మి!

పుణ్యము పండిన పురంధ్రులారా!
పేరంటానికి రారండమ్మా!

పరాధిపత్యపు నిరంకుశత్వము
పరాధీనజన నిరాశతత్వము
కూడు గుడ్డ పడగొట్టిన దోపిడి
గుండెలు రాచిన కోరల రాపిడి
తరాల తరబడి తరిమిన దాస్యము
అవాంతరమ్ములు అవమానమ్ములు
ప్రవాసబాధలు ప్రాణహరణములు
లేవు లేవు రాబోవిక మనకు!

పుణ్యము పండిన పురంధ్రులారా!
పేరంటానికి రారండమ్మా!

నేటినుండి ముమ్మాటికి నిజముగ
సుస్వాతంత్రులము సుమండి మనము
నేడే జాతికి నిజమగు పండుగ

## శ్రావణి

ఇన్నాళ్ళేండ్లకు ఇదే శ్రావణము !
స్వతంత్రమహిళా జన పార్వణము !

త్రివర్ణ చక్ర ధ్వజ చ్ఛాయలో
స్వాతంత్ర్యశ్రీ సహచారిణిగా
వచ్చిన మన శ్రావణ వరలక్ష్మికి
పసుపుకుంకుమల కుసుమాంజలుల
పూజచేసి నీరాజనమొస్తి
పిన్నలు పెద్దలు పేరంటాంద్రు
భారతవిజయము పాడుకొనండి !

జయజయ భారత ప్రియ జనయిత్రీ !
సమస్త భారత సమైక్య ధాత్రీ !
నవశకోదయానంద విధాత్రీ !
స్వతంత్ర హిందూస్థాన సవిత్రీ !

# మూడవ వసంతము

భారతీయ స్వతంత్రతా భాగ్యవల్లి
కొదవె మూడో వసంత శుభోదయమ్ము
ద్వారద్వారమ్మునకు పూలతోరణాలు
కట్టుదము నేడు పల్లెల పట్టణాల !

అఖిల స్వతంత్రరాజ్యమ్ములు మన
త్రివర్ణ ధ్వజమ్మునకు గౌరవ మొసంగ
హింసతో కుళ్ళిపోయిన నేల మన యహిం
సాధర్మ దేవత శరణు గోర
నానా ప్రభుత్వాధినాయకుల్ మన రాయ
బారుల ధీపాటవమ్ము మెచ్చ
విఖ్యాత రాజ్యాంగ విదులెల్ల మన నాయ
కుల ప్రభావమున కంజలి ఘటింప

శాపమునయట్లు చేజేత మాపుకొన్న
భారతావనీ ప్రాచీన వైభవమ్ము
ఆసియా నెల్ల కైసేయునట్టి శుభము
పూర్త మీ నాటి స్వేచ్ఛామహోత్సవంబు !

నెత్తురొలుకని యుద్ధనీతితో దాస్య వి
    ముక్తి గూర్చిన మహాత్ముని మతంబు
స్వాతంత్ర్యమున కాత్మ సర్వస్వ ముంకువ
    సలిపిన త్యాగభీష్ముల పథంబు
ఆటంకములనెల్ల దాటించి దేశోన్న
    తికి త్రోవ చేయు నాయకుల నేర్పు
సర్వసమత్వ లక్ష్యమ్మెప్పు మన ప్రజా
    స్వామ్య రాజ్యాంగంపు సౌష్ఠవమ్ము

మానవుల కేడుగడయని, మాగ తనంపు
గమ్యమని జాతికిని గర్వ కారణమని
బ్రతుకు బంగారుపంటని మతి దలంచి
సలుపుదము మూడవ యుగాది సంబరంబు.

ము క్త ఝ రి

కులమత వల్మీకముల ద్వేష ఘోషోర
గమ్ములొనర్చు ఫూత్కారములకు
ధనిక నిర్దాక్షిణ్యమున కమ్మడై క్రుగ్గు
కార్మిక ప్రజల యాక్రందనములకు
ఆకలిగొన్న దిగంబరమూర్తులౌ
పేదల యార్తనినాదములకు
సంకుచితాచార పంక మగ్నమ్ములౌ
జనపదంబుల యపస్వరములకును

అంపకము పెట్టు వెరవు లభింపదన్న
దిగులు విడిచి రండో భారతీయులార!
పాడుకొందము గొంతెత్తి భారత స్వ
తంత్రతా మహోత్సవ సుగీతముల నేడు.

శ్వాపద మట్లు నేటి నరజాతి పరస్పర మారణాయుధ
వ్యాపృత మై మహాప్రళయయాత్రకు సాగెడి యీ విపద్దశన్
బాపి ప్రపంచశాంతి కొక మార్గము జూపిన బాపుజీ యహిం
సా పరమార్థ మీ భరత జాతిస్వతంత్రత కంగరక్షయా!

## ఓ ప్రభూ!

వివిధకులముల వివిధభాషల వివిధజాతిమతాలతో
సవిధభూముల రణగుణధ్వని సలుపు శత్రుదళాలతో
నివురుకోసము పంటకుప్పకు నిప్పువెట్టు మతాలతో
మివుల కీడ్వడు భరతధాత్రికి మేలుచేయవయా ప్రభూ!

వీరమాతలు వీరపత్నులు వీరు లెన్నో యేండ్లుగా
కోరి, యెందరో చెఱల పాలై ఘోరశిక్షల కగ్గమై
భారతావని స్వేచ్ఛకోసము ప్రాణముల్ బలిచేసిరో
వారి యాత్మల కిమ్ము శాంతిని ! వరము మాకదియే ప్రభూ !

'మానవులకగుగాక నిత్యము మంగళ' మ్మను రీతికిన్
'పూని విషసర్పములకును పాల్పోయవలె' నను నీతికిన్
గాన కవితా చిత్ర నర్తన కళలు పండిన భూతికిన్
తానకంబగు జాతికిం దగుదారి చూపవయా ప్రభూ !

పరుల యేల్బడి బాప పోరెడివారి జేరని వారలన్
పరుల కండగ నిల్చి స్వజనుల ప్రతిఘటించిన వారలన్
దొరకినంత స్వలాభమునకై ద్రోహులాడెడి వారలన్
కరుణ జూడుము ! యెల్ల రర్హులు గారె నీదయకో ప్రభూ !

# ప్రార్థన

అవధారు జగదీశ! విశ్వజన కళ్యాణప్రదా! సత్కృపా ర్ణవ! నెక్కేండ్లపరాధిపత్యమును పారద్రోలి, స్వాతంత్ర్య వై భవము గాంచిన నూతన భారత ప్రజాస్వామ్యమున్ సర్వప్రజో త్సవముంగూర్పగ సర్వతోముఖసమృద్ధంబౌనటుల్ ప్రోవుమా!

'ప్రజల నెత్తుటితో గ్రొవ్వి బలసి యూడు
పరతంత్ర్య పిశాచమ్ము వదలె' నన్న
సంబరము తప్ప ఇంట దీపమ్ము వెట్ట
లేము; ప్రమిద స్నేహము లేదు; లేదు వత్తి!

పదునెనిమిదేండ్ల యీడు పైబడిన గాని
భారతప్రజాస్వామ్య మిప్పటికి గూడ
ప్రజల కన్నోదకముల కొఱంతనైన
మాన్పలేకున్న దేమి కర్మమ్ము గాని!

---

# ప్రబోధము

మన మేనాడనుకోని యాహవము సంప్రాప్తించె, చైనీయ వం
చనచే నేడు స్వతంత్రభారత ప్రజాస్వామ్య ప్రభుత్వ ప్రతి
ష్ఠను గాపాడగ రెండు, రండు, పటుదోశ్శక్తిన్ విజృంభించి పా
వనశీతాద్రి నపాస్తశాత్రవ మొనర్పన్ భారతీయప్రజల్ !

సరిహద్దుల్ సరిగావటన్న నెపమున్ సాగించి, నీహార భూ
ధర సీమాంతము లాక్రమింపగ మహౌద్ధత్యాన దండెత్తి వ
చ్చిరి చైనీయులు; వారి దుండగము నిశ్శేషంబు గావింప సం
గరపార్థుల్ భరతాత్మజుల్ విజయశంఖాలూద లేలెండికన్.

స్నేహమె ముఖ్యమంచు, సహజీవనమే పథమంచు, శాంతిగే
యాహితమంచు, పైకి వచియించుచు చాటుగ ఘోరయుద్ధస
న్నాహము సేసి, యిప్పుడు రణంబునకున్ సమకట్టినారు చీ
నాహతకుల్ తదుద్ధతి నణంపనిచో నయశంబు కాదొకో !

# ప్ర బో ధ ము

ఆఫ్రేషియాల రాజ్యములకు నాయక
త్వము పూనవలెనన్న వాంఛతోడ
ఏ రాజ్యకూటమిన్ జేరని మన తటస్థత
కెగ్గు సేయు యత్నంబు తోడ
మన యార్థిక ప్రయోజన పురోగతి కంత
రాయమ్ము గూర్చు దురాశ తోడ
సమితిలో మిత్రదేశములతో మనకున్న
స్నేహమ్ము చెఱచు దురూహ తోడ

శాంత్యహింసాపథమ్ముల సాగు భార
తప్రజాస్వామ్య విజయరథమ్ము మీద
కెత్తి వచ్చిరి చైనీయు లేమగుదురు
చక్రముల క్రిందబడి నల్గి చావకుండ.

చీనా చేసిన యీ దురాక్రమణ కిస్సీయంచు దేశంబు లె
న్నో నిందించిన వండదండలగు కమ్యూనిష్టు రాజ్యమ్ములున్
పోనాడెన్ బలమున్న దంచిటు నయంబున్ దక్క వర్తించు దు
ర్మానిన్ సైపదు లోక; మెప్పటికి ధర్మంబేజయించుం దుదిన్.

పరతంత్రతత్వముమాపి చక్కని ప్రజాస్వామ్యంబు నెక్కొల్పి యం
దరి సౌహార్దముతోడ మానవజగత్కల్యాణ సంధాన సు
స్థిర యత్నంబొనరించు భారతమ్ముపై ద్వేషంబు చైనీయ వి
స్తరణాకాంక్షకు హేతువన్నది యథార్థంబింక వేయేటికిన్.

తనకున్ గోట్లకొలంది విత్తము, మహోద్దండాయుధానేక సా
ధనసంపత్తి యొసంగి సర్వమున కాదర్శంబుగా నెంతయో
యనుగుండోడయి నిల్చి యాదుకొను రష్యామీది కే కత్తి గ
ట్టిన చీనా మన భారతోర్విపయి దాడిం జేయుటాశ్చర్యమా?

తరతరాలుగ భారతంబుతో ముడివడ్డ
దృఢమైత్రిబంధమ్ము ద్రెంచివైచి
శాక్యసింహుని యహింసా ధర్మశాంతి ప్ర
బోధమ్ము లన్నియు బుగ్గి గల్పి
అర్థనగ్నులు బుభుక్షాతురులై కుందు
ప్రజల దుఃఖము కానపాలు చేసి
నాయకోత్తముడు సన్యట్ సేను సద్భావ
సంప్రదాయములు నాశమ్మొనర్చి

# ప్ర బో ధ ము

శాంతి గోరెడి పొరుగు రాజ్యమ్ముమీద
వట్టి సామ్రాజ్యవాదియై వచ్చిపడిన
కలుకు చైనాకు సద్బుద్ధి గలుగుటకును
లెండు భారతవీర ప్రచండులార!

ఈ నాటిదా అల హిమగిరితో పొత్తు
వేదపురాణకాలోదితంబు
ఈ దేశమున కిదిచీ దుర్గ కుడ్యంబు
దేవతాతతుల కేళీవనంబు
ఆర్యామహాదేవి కది పుట్టినిల్లు గం
గా భవానికి సూతికాగృహంబు
అర్ధేందు చూడున కత్తవారిల్లు తీ
ర్థక్షేత్రములు కది రత్నపీఠి

హిమధవళ మైన యీ కొండ యెల్ల యిపుడు
దేవతా కోపరక్తాక్షి దీప్తి వోని
మానవుల వేడినెత్తురు మడుగు కట్టె
యరుణ మొనరించె చీనా దురాక్రమణము!

అంతశ్శుద్ధిగ నేవిభేదములు లేకాసేతు శీతాద్రిప
ర్యంతోదగ్ర సమగ్ర భారత జనం బాబాల గోపాలమున్
సంతోషంబున దేశరక్షణకు దీక్షాకంకణం బూనుటన్
చింతింపన్ మన మేలుకే జరిగె ఈ చీనా దురాక్రాంతియున్.

కాదిది సౌహార్ద్రత
గాడా! సకలాసియాధికారాక్రమణో
న్మాదం బిది యొక మనకే
కాదు ప్రమాదంబు సర్వఖండమ్ములకున్.

స్వాతంత్ర్యంబును లేదు, లేదిక ప్రజాస్వామ్యంబు, శాంతి ప్రథా
నీతుల్ లేవిక, నాత్మగౌరవము లేనే లేదు, చీనా మహో
త్పాతంబున్ సమయింపకున్న ఇది లోభావించి మువ్వన్నె జం
డా తౌషారనగాగ్రసీమ నెగురాడం జేయరండో ప్రజల్.

వలిమల యున్న దుత్తరపు వైపున వార్ధులు మూడు దిక్కులన్
గలవు గడమ్ములై భరతఖండము నిర్భయ మన్నమాట వై
దొలగెను నేడు భారతసుతుల్ పలుకుంబనులన్ సమైక్యమై
నిలుచుటె కల్మి బల్మిగల నిక్కపుదుర్గము దేశరక్షకున్.

## ప్రబోధము

ఖండ ఖండాంతరఖ్యాతి గడించిన
భారత యోధుల పౌరుషంబు
తమ తాళిబొట్లు సైతము దేశరక్షణ
నిధికి నర్పించు మానినుల యీవి
యుద్ధరక్షణ సాధనోత్పత్తి శక్తికి
మించి సాధించు కార్మికుల దీక్ష
చెమట నెత్తురుగ సేద్యముచేసి రక్షణా
ర్థమ్ము పండించెడి రైతుశక్తి

శాస్త్రవేత్తల విజ్ఞాన చతురిమంబు
కలసి రక్షణకవచమై నిలిచియుండ
ఈ భరతధాత్రి నెవరు కన్నెత్తి చూడ
లేరనంగ చైనీయుల లెక్కయేమి ?

[ఆలిండియా రేడియోవారికి కృతజ్ఞత]

# సందేశము

సకలాసియా ఖండ శాంతికి విత్తనం
బైన బౌద్ధంబుచే నంకురించి
ఆ నాటి ఫాహియానాది విజ్ఞానుల
రాకపోకల జేసి మ్రానుగట్టి
పరదురాక్రమణంపు తఱి నంపినట్టి వై
ద్యమ్ము సాయమ్ముచే కొమ్మసాగి
ఐక్యరాజ్య సమితియందు సభ్యత్వంబు
పొందించు యత్నాన పూచి, కాచి

సరగ బాండుంగు సభతోడ సఫలమైన
భారతీయ సుహృద్భావ పాదపమును
త్వత్కపట దురాక్రమణోగ్ర పరశుధార
నఱికివైచితివోయి! చీనా ప్రధాని!

శాంతిని గోరువార మయి సంగరపుం జతనంబు సేయుటో
క్కింత యుపేక్ష సేసితి, మదే యొక సందుగ సాగె ఈ దురా
క్రాంతియు, నంతమాత్రమున రంతులు గొట్టకు! వీరభారతా
క్రాంతపరాక్రమంబికను సాగును చూడుము దమ్ములుండినన్.

మాకును మీకు నెల్లల సమస్యయె లేనపు డేటికీ తగా
ద [illegible]ని తెచ్చితీ వోరుల ధారుణి గోరని శాంతులైన మా
పై కనికెత్తి వచ్చితివి బాపురె! నీ కపటమ్ము నిన్ను నే
కాకిని జేసె, మా కొసగె గాఢ సమైక్యము మాకు ధర్మమే!

నీ దౌర్జన్యము సభ్యరాజ్య సమితుల్ నిందించుటే కాదు, మా
మీదఁ శాంతిపథైక గాములకు పేర్మిఁ జేసి నీ సంగరో
న్మాదంబున్ వడలింప నూత్నరణ సామగ్రీ శతఘ్ని విమా
నాదుల్ సాయము చేయుచుండి రది కాదా సాక్షి మా నీతికిన్!

నీ మూలాన టిబెట్టుశాంతి కెరయై నిర్భాగ్యమయ్యెన్ దలై
లామా కాశ్రయమిచ్చినా మనుచు నల్కంబూని విద్రోహివై
మా మైత్రిన్ జెడగొట్టుకొంటి విది సన్మార్గంబె నీకున్న సం
గ్రామౌద్ధత్యము చూపరాదె అల చాంగైషేకుపై మూఢుడా!

తిండికి బట్టకున్ గఱవు తెచ్చి జనమ్మున కెట్టి స్వేచ్ఛ లే
కుండ నణంచిపెట్టి సమరోద్ధతితో సకలాసియాఫ్రికా
ఖండములందు నీ దురధికారము నెక్కొలుపం దలంచు నీ
దుండగ మంతయుం దెలిసి తోడ్పడరా డొకడేని నీకికన్.

చాలక కాదు కేవలము శాంతిని గోరియె యాతటస్థ రా
జ్యాల సభానిబంధనల కన్నిఁటి కొప్పితి మీవు గూడ పం
తాలకు బోక మేకొనుము, దాన జగద్ధితమౌను లేనిచో
ఆలపుటగ్గి ముట్టుకొని యందఱకున్ విలయంబు గల్గెడిన్.

జవహర్లాలు ప్రధాని నేటికిని పస్తాయించుచున్నాడు నీ
బవరంపున్ గరువమ్ము నెంప నది దౌర్బల్యంబు కాదోయి సం
నవతాదృష్టియెకాని, యిప్పటికినైనన్ మించి పోలేదు పెం
పువడం గోరిన సమ్మతింపుము కొలంబో తీరుమానంబులన్.



# పిలుపు

బౌద్ధ మ్మాదిగ వృద్ధి నొందిన సుహృద్భావమ్ము పోకార్చి దు
ర్బుద్ధిన్ భారతభూ దురాక్రమణ విద్రోహమ్ము గావింపగా
సిద్ధంబై పొలిమేర పొంచె నదిగో చీనా బలమ్మోక త
మ్యుద్ఘోన్మాద మడంప నేకమయి రండో భారతీయప్రజల్ !

చల్లారెన్ సమరాగ్ని వెన్కకు జనెన్ చైనాబలమ్మంచు శాం
తిల్లంజెల్లగు, రాజ్యవిస్తరణదుర్బుద్ధి దృప్తుడే వేళ నే
కల్లోలమ్ముల దెచ్చునో యనుచు దీక్షన్ సంగరోద్యోగ జా
గ్రల్లోకంబుగ నుండుటే మనకు కర్తవ్యంబు నేడెంచగన్.

హిమవత్ప్రాంత సీమలవి యిప్పటివా ? యెపుడేని తద్వివా
దము పొడసూపెనా యిపుడదాటుగ నేటికి సాగె నీ దురా
క్రమణము? పంచశీల పథగాముల యభ్యుదయమ్ము చూచియో
ర్వమియొ? స్వరాజ్యవిస్తరణవాంఛయొ సైనికదర్పదౌష్ట్యమో?

ప్రతికూలమ్మగు కాలమెంచియొ? సుహృద్రాజ్యంబులెన్నో నిరా
కృతి గావించుటనో? సమైక్యభరతోర్వీదీక్ష లోనెంచియో ?
హత సైన్యమ్ము దలంచియో తనకుదానై వెన్కకుంబోయె దు
ర్మతి చీనా యెటులైనగాని మది నమ్మంగూడ దా ద్రోహులన్.

ఇది సహృద్దుల పేచీ
కదనము కా దాసియాఫ్రికా స్వాతంత్ర్యా
భ్యుదయ మహోద్యమ నాశ
మ్మొనరించెడు దుర్నియంత్ర యుద్ధము గానీ !

మఱచెనేమో బౌద్ధమతము పెట్టిన భిక్ష
సహజీవన స్నేహశాంతి శిక్ష
పాటింపదో యేమొ ! ఫాహియానాది పు
రాణవిజ్ఞానుల రాకపోక
తెలియదేమో తన దేశమ్ము కష్టాల
పాలైన తఱి సాయపడిన విధము
ఏమఱనేమో సుహృద్రాజ్య సమితిలో
తన్ను జేర్పింప గైకొన్న శ్రద్ధ.

అల్ల బాండుంగు తీర్పు పొల్లయ్యె నేమొ
సైన్యబలమును రాజ్యవిస్తరణకాంక్ష
మత్తుగొల్పగ మనమీది కెత్తివచ్చె
నిపుడు చీనా నియంతృత్వ మెంత పొగరొ!

పారిశ్రామికులున్ కృషీవలులు, వ్యాపారాధికారుల్, కళా
పారీణుల్ నిరుపేద లూర్జితధనస్వాముల్ వదాన్యుల్ జమీం
దారుల్ వీరులు సాధువుల్ వివిధశాస్త్రప్రాజ్ఞులీ భారతో
ర్వీరక్షార్థము చేతనైనకృషి గావింపంగ లెం డెల్లరున్.

సింహంబు లటు శత్రుసేనపై లంఘించి
తున్నాడు రాజపుత్రుల బలమ్ము
మరఫిరంగీ గుండ్ల సరకుసేయక ముందు
కురుకు మరాటీల యుద్ధపటిమ
సన్నీల పోట్లతో శత్రుసేనల పార
ద్రోలంగ జాలు ఘూర్ఖాల తెగువ
అగ్నిగోళమ్ముల కైన వెన్నీని పం
జాబీ సిపాయీల సాహసంబు

కోటగా గట్టి నల్వది కోట్ల మంది
ద్రోహులైన చైనీయుల త్రుళ్ళడించి
వీరమాతకు భారతోర్వికి జయమ్ము
గూర్పగా కంకణము గట్టుకొనుడు నేడు !

పిలుచుచున్న దదిగో మన ప్రియభారత జనయిత్రి
రవళించిన దదిగో మన రణదుందుభి సమరధాత్రి
నిప్పులుమిసె మంచుకొండ నెత్తమ్ముల మరఫిరంగి
శోణమయ్యె సితహిమాద్రి మానవరక్తమ్ము పొంగి.

ఓ స్వతంత్ర భారతీయ యువతీయువకులు లెండి !
మువ్వన్నెపతాక నీడ మోహరించి నిల్వండి !
ఎంతవారికైన తప్పదేదో యొకనాడు చావు !
భీరువులకు మన స్వతంత్రభారతమున లేదు తావు !

పశుబలానికన్న ధర్మబలమునకే తుదివిజయము !
జయనాదముతో వెలయును శాంతిదేవతా నిలయము !
తనువో ధనమో రక్తమొ తల్లికోస మర్పింపుడు !
సరిహద్దుల పొంచియున్న చైనీయుల తున్మాడగ
జన్మభూమి గౌరవమ్ము స్వాతంత్ర్యము కాపాడగ
నరనారీ తతులారా ! నడుము కట్టి లేవండి !
మువ్వన్నెపతాక నీడ మోహరించి నిల్వండి !

# తెలుగుతల్లి

యుద్ధముల వెన్నియని యోధులకును
చేతికెముక లేకిచ్చెడి దాతలకును
శిలకు ప్రాణమ్ము వోసెడి శిల్పులకును
జననియై వన్నెకెక్కె నా తెనుఁగుతల్లి !

పంటపొలములకును పాడిపశువులకును
జీవనదులకు పర్వతశ్రేణులకును
దివ్యక్షేత్రములకు - పుణ్యతీర్థములకు
ఉనికిపట్టయి వెలసె నా తెనుగుతల్లి !

తెనుగు శిల్పుల హస్తకౌశలము చాటు
గుళ్ళతో గోపురాలతో గుహాలతోడ
కాలిడిన తావు చిత్రాల శాల గాగ
నను పరవశుని జేయు నా తెనుగుతల్లి !

## ము క్త యు రి

తెలుగు నేలపైన తిరుగాడునప్పుడు
తెలుగుమాట నోట బలికినపుడు
తెలుగువారి కథలు తలపోసినప్పుడు
పొంగిపోదు గర్వమునను నేను !

తీరి బంగారు పండెడు తెలుగునేల
తేటనీటితో ప్రవహించు తెలుగునదులు
తెలుగువాసిని ప్రకటించు తెలుగు గిరులు
తలచుకొన్నంత నా మేను పులకరించు !



# కుమారా!

నాలుగు సముద్రముల తరంగాల పైన
జాయ లొలసెడు విజయ ధ్వజమ్ము లాడ
యశము బేహార మాడె నొకప్పు డాంధ్ర
నౌక లను మాట తలపోయుమో కుమార!

తెలిగొడుగు నీడ మగధ సీమలకు గూడ
శాంతిఁ జేకూర్చిన మహాంధ్రజాతి పౌరు
షోదయ చరిత్ర కీవు దాయాది వగుట
యెంత భాగ్యమ్ము గ్రహియింపుమీ కుమార!

కోవెలల గోపురమ్ములఁ గొండ గుహల
విశ్వవిద్యాలయములఁ గావించి దేశ
దేశములకు సంస్కృతి ప్రసాదించినట్టి
యాంధ్రవిజ్ఞాన మెఱుగుమయ్యా కుమార!

తేనె యుగ్గుతోఁ గ్రైతకుఁ దెలుఁగు బిడ్డ
శిల్పలక్ష్మికిఁ గ్రొత్తకైసేత దీర్చి
గౌతమీ కృష్ణల తరంగ గీతి చాటు
నాంధ్ర నాగరికత నెంచుమా కుమార !

కుంచములతోడ ముత్యాలు కొలుచు కొనిన
రత్నగర్భ యీ యాంధ్రధరా మతల్లి
యా పురాణ మహైశ్వర్య మంతరింప
నేమి కతమొ యోచింపు మోయీ కుమార !

# విశాలాంధ్రము

నీలిమబ్బుల రాయు నీలగిరీంద్రమ్ము
పాదపీఠమ్ముగా పాదుకొల్పి
పసిడిమువ్వల మ్రోత లెసగు తరంగాల
గౌతమి మొలనూలుగా ధరించి
సౌరుమీరిన వంశధారా ప్రవాహమ్ము
ముత్యాల గ్రైవేయముగ వహించి
చిలుకసంద్రము ముఖశ్రీ జూచుకొనెడి కెం
గేలి యద్దమ్ముగా గీలుకొల్పి

అమ్మహేంద్రాచలము కిరీటమ్ము వెట్టి
యొరగుదిండుగ తూర్పుసాగరము నాని
నాల్గుకోట్ల యనుంగు సంతాన మేలు
మా మహాంధ్రమాతకు ప్రణామమ్మొనర్తు !

## ముక్తఝరి

తరతరాల దాస్యత మము తొలగించిన యీ తొలివేకువ
ప్రాగాశాఫాలసీమ స్వాతంత్ర్యారుణ తిలకము
పొడుపు కెంపు గుడి కట్టుచు శోభిల్లిన యీ శుభవేళను
పుడమి ప్రాకు పురుగుకూడ ఎఱక లెగిరి మొగులాడు!

ఉత్సాహమహోదయమున ఉత్సవసుముహూర్తమ్మున
పీడకలల పాడు నిదుర తేలిపోయి మేలిపగన్న
నరనారీ సందోహము నాల్గుకోట్ల సంతానము
నవజీవవికాసముతో ప్రవిమల చైతన్యముతో

మాలాకుసుమమ్ములట్లు కేలుకేలు గీలించుక
సకలాంధ్ర మొక్కరాష్ట్రము సలిపితీరవలె నంచును
ఒకేసారి ఒకేదారి సాగిపోవు సమయమ్మున
ఓ మా ప్రియజనయిత్రీ! ఓ సువిశాలాంధ్ర ధాత్రి!

నీ పురాతనౌన్నత్యము నీ యద్యతనాభ్యుదయము
గర్వమ్ముగ వినుతింతుము సర్వమ్ముగ వినిపింతుము!
నీ కృపాప్రసన్న దృష్టి నీ యాశీః కుసుమవృష్టి
విరియింపుము వెలుగువెల్లి! కురియింపుము తెలుగుతల్లి!

మగధేశ్వరుని కోట మొగలి గోపురముపై
ఆంధ్రధ్వజము నాట్య మాడినపుడు
చెక్కినశిలకెల్ల జీవమిచ్చిన యాంధ్ర
శిల్పమ్ము కృష్ణ ఘోషించినపుడు
నన్నయ్య భారతామ్నాయమ్ములో కవి
తా దేవతా వేణు వూదినపుడు
అఖిలదేశమ్ముల కాంధ్రసంస్కృతి వోయి
తొలిభిక్ష యిడి యాజ్ఞ గొలిపినపుడు

శౌర్య శిల్ప కళా జ్ఞాన చతురిమమ్ము.
చతురుదధివీచికలు జయస్తుతు లొనర్ప
భారతావనీ హీర కోటీరమట్లు
అలరిన తెలుంగుతల్లి! జోహారు లమ్మ!

గౌతమీ సరిదూర్మికా కలస్వనములో
నన్నయ్య హుందా తనమ్ములోన
పెన్నచల్వల గుత్తగొన్న తెమ్మెరలలో
తిక్కన్న పలుకు పొందికలలోన

తుంగభద్రాభంగ భంగభంగిమములో
పెద్దన్న యల్లిక బిగువులోన
కృష్ణవేణీ మహోర్మికల త్రుళ్ళింతలో
రామకృష్ణుని యొయ్యారములలోన

కత్తిగంటమ్ము లొక్క పోకడల పెనగి
రాచఠీవికి పచ్చతోరణముగట్టి
యిడిన సుకవిసమ్రాట్టు లిల్లడము సొమ్ము
శ్రీవిశాలాంధ్రమాత కైసేయుగాత !

బ్రతికున్న దివ్యరూపాల రాలకు గూర్చు
తెనుగుశిల్పుల పవితనము చూచి
పలునూరు సామ్రాజ్యముల నెలకొల్పిన
తెనుగుకత్తుల వాడితనము నెంచి
నాదమ్ముతో చిదానందరస మ్మొలుక
తెనుగుపాటల తీయదనము తలచి
మున్నిటి వాణిజ్యమున పేరుమోసిన
తెనుగు నావికుల పెత్తనము తలచి

ఖండఖండాంతరముల యాగంతుకులను
శిష్యులుగ గొన్న తెలుగువైదుష్య మరసి
తొంటి పేర్వాసి త్రవ్వి యెత్తుటయె గాని
నేటి దైన్యస్థితి కెడంద బీటవారు !

చిక్కులు పెక్కుగా పొరుగుసీమల జిక్కిన యాంధ్రదేశపుం
ముక్కల నెల్ల నొక్కటిగ జేసి పురాతన వైభవోన్నతుల్
దక్కక శిల్పగాన కవితా ప్రభుతా కరదీపికారుచుల్
దిక్కుల నిండ సద్యశము తేవలె తల్లికి యావదాంధ్రమున్.

పండి ముక్కారు క్రొంబసిడి పంటలు వసుం
ధర రామపాద సాగరము పాడిచి
సకలపరిశ్రమాస్థానమై యైశ్వర్య
పడి ధరారత్న గర్భమ్ము త్రవ్వి
దేశదేశాల శాంతికి చేతిదివ్వెగా
తనరి వేదాంత తత్త్వమ్ము తెలిపి
విలసిల్లి యాంధ్రుల తల భారతమ్మున
రాష్ట్రాధిపత్య గౌరవము నొంది

## ము క్త ఝ రి

కార్యదీక్ష ఆంధ్రుల స్వమైక్యమ్ము తోడ
స్వేచ్ఛ ప్రత్యేకరాష్ట్ర సంసిద్ధి తోడ
కలిగి, ఆసియా కొక వెల్గు కంబమట్లు
తెలుగుతల్లి ! ఆకల్పాంత మలరు మమ్మ !

3—1—1949.



# ఉగాది!

కాలచక్ర మే దెట్టులైనగాని యాఁగ
కుండనె పరిభ్రమించుచునుండు నెపుడు
వచ్చుచుండు పోవుచునుండు వత్సరములు
కాని జగతికి పండు గుగాది యనిన.

నవశరత్తున కొక్క- మానవుడె గాదు
పశువులును పక్షులును పాదపములు కీట
కములు గూడ వినూత్న వికాస మొందు
యూవనోదయమైన దేహమ్ము వోలె.

భూతకాలమ్ము కన్న రాబోవు కాల
మభ్యుదయ దాయకమ్మను నాశ సహజ
మెల్లవారికి అట్లు కాదేని బ్రతుకు
భారమై తోచు నెంతటి వారికైన.

కోరికల తీవలకు సుధాధార యగుచు
తను మనంబుల కుత్సాహ జనకమగుచు
సృష్టికంతకు యౌవన శ్రీవిలాస
మై వసంతమ్ము శోభావహమ్ము వచ్చె.

ఏ చూతము చిగిర్చెనో చూతమని తోట
తోటకు కోయిల మేటి తిరుగ
ఏ తీవ పూచినదో తెరికగ చూడ
పొద పొదకును తేటి కొదమ పోవ
ఏ విరి వికసించెనో వెదకాడగా
తీగ తీగకు తేనటీగ చనగ
ఏ పండు దోరదానో పరికింపగా
చెట్టు చెట్టుకు రామచిలుక వెడల

భామినీ కైశ్యవల్లీ పరిమళములు
కొల్లగొన సందెగాలి ఝల్లిల్లు దూర
చేవచావని హృదయాలు చివురు దొడుగ
ఆమని యెసంగె నిత్యకళ్యాణమగుచు.

## ఉగాది

ఏనాటి ఎడబాటో ఈనాడు తీరి
మాటలలో మనసులో మమతలు వారి
జనని కౌగిట హత్తుకొను తెల్లువారి
పాలి కుగాది సంబర మొకేసారి.

పూల దోసిళ్ళంతో పాద పూజచేసి
వేపపూ పచ్చడింత నైవేద్య మిచ్చి
ఏటి కొకనాటి విందైన ఈ యుగాది
కొసగవలె నూతనోత్సాహరసము కాన్క

# జయారంభము

ఓ జయారంభమా! ఓ ప్రియారంభమా!
దయచేసి మా స్వాగతమ్ముందు కొనుమ!

అరువదియేడులయ్యె భవదాగమనంబయి, నాటిదాస్యపున్
బరువు దొరంగి స్వేచ్ఛగల భారతజాతి సమస్త మిప్పుడ
చ్చెరువుగ నీకు స్వాగతము చెప్పుచునున్నది, బాలభానుసుం
దర కిరణారుణద్యుతి వితాన సమున్మిషితోన్ముఖంబుగన్.

క్రొత్తగ రాష్ట్రమేర్పఱచుకొన్న తఱిన్ తొలివింద వౌచు మా
చిత్తము లెల్ల రమ్యవనసీమలుగా సుమనోరథాల పూ
గుత్తులుగాది కానుకలుగ గూర్పగ వచ్చిన నీకు స్వాగతం
బొత్తి వచింతుమమ్మ! విజయోత్తర భావుకమా! జయాబ్దమా!

ఎదలోని రాగసంపద వోని మావి కెం
జివురు జొంపము గద్దె సవదరించి
కడకంట వెలివారు కరుణామృతము వోని
సుమ మరందమున పాద్యము నొసంగి

## జయారంభము

చెక్కిటి చిఱునవ్వు సిరి వోని విరిమల్లె
పూలదోసిళ్ళతో పూజ సలిపి
అలయికలో గాలి మొలకలా పిక కుహూ
రుతముల తోడ స్వాగతము చెప్పి
జీవితము వోలె తీపియు చేదు గలుగు
వేపపూ పచ్చడింత నైవేద్య మిచ్చి
అరువదేండ్లకు వచ్చిన యతిథి కాంధ్ర
రాష్ట్ర మిచ్చు నానంద నీరాజన మిది!

మాకు విజయంబు రాష్ట్రసంప్రాప్తి గూర్చి
నిరుడు తనపేరు సార్థకపఱచుకొనియె
అట్లె యన్వర్థ నామధేయముగ నీవు
జయ మొసంగుము! మా యాంధ్రజాతికెల్ల!

తెనుగువాకిళ్ళ పచ్చని తోరణాలు
తెనుగు తోటల గుబులొక్కను మావి పూలు
పల్లెపల్లెను పెండ్లి పందిళ్ళ చాలు
ఏటికేడాది మా కిమ్మదే చాలు!

## ముక్తఝరి

అంతకంతకు శ్రీవసంతోత్సవాలు
పూలతోటల నిండ బుక్కాగులాలు
పికకంఠమురళిలో ప్రేమరాగాలు
వలి తెమ్మెరల యూరుపుల సుగంధాలు
తేటిపాటల లోని తీయదనాలు
ఏటికేడాది మా కిమ్మంతె చాలు !

కూడుగుడ్డల కెట్టి కొరత లేకుండ
పాడిపంటలకు లోపమ్ము రాకుండ
జాతిలో మతములో సఖ్యమ్ము పండ
మాటలో మనసులో మమతలు నిండ
ఏటికేడాది మా కిమ్ము కైదండ.

ఇంటింట వెలుగు సాహిత్యదీపములు
రచ్చరచ్చను శాంతి రాయబారములు
క్రొత్తరాష్ట్రాన ముక్కోటి కంఠములు
జయ ఉగాది కొనగ్చ జయనినాదములు.

ఓ జయారంభమా ! ఓ ప్రియారంభమా !
ఆశీర్వదింపుమా ! ఆంధ్రరాష్ట్రమును !

# శార్వరి స్వాగతము

తూర్పు తెలవారుచుండ నేదో వినూత్న
జీవకళ తోచు నీ భూతసృష్టిలోన
పోయె కాబోలును వికారి హాయనంబు
వచ్చె కాబోలు శార్వరి వత్సరంబు !

సృష్టిలో మంచి పోని చెడుగు లేదు !
చెడుగెదో కొంతలేని మంచియును లేదు !
కాని, యెప్పటి కప్పుడు మానవుండు
సంతత భవిష్యదాశాభిసరణ జీవి !

కాలపయోధి వీచికల కైవడి నొక్కటివెంట నొక్కటు
జ్జ్వలముగా శరత్తు లరుదెంచుచు పోవుచునుండు - నైన - ఆ
శాలతికల్ చిగుర్చ సరసమ్ము లెదల్ వికసింప జీవలో
కాళి యుగాది యన్న నుబలాటపడున్ సరిక్రొత్త వింతగన్.

పోయిన యేటిమాట తలపోయక - అర్వదియేండ్ల కొక్క ప
ర్యాయము వచ్చిపోయెడు ప్రియాతిథివంచును క్షేమలాభముల్
సేయుదువంచు స్వాగతము చెప్పెద మిప్పుడు సుస్వతంత్ర జా
తీయ భవిష్యదభ్యుదయ దేవతకుంబలె నీకు శార్వరీ !

శ్రీగిరి భ్రమరాంబికా కురుధమ్మిల్ల
మల్లికా మంజరీ మధుర సురభి !
తిరుపతి వెంకటేశ్వర ఫాలతల యుక్త
కర్దమపుండ్ర సౌగంధలహరి !
భద్రాద్రి శ్రీరామ భద్ర బాహాంతర
స్థల తులసీదామ సౌరభమ్ము !
సింహాచలాగ్ర నృసింహ వక్షోంతర
శ్రీఖండ చర్చాపరీమళమ్ము !

కలసికొని క్రొత్తవలపులు మొలకలెత్త
గౌతమీముఖ జీవనదీ తరంగ
శీతలాంధ్రావనీ మధుప్రాతరనిల
మర్వదేశ్ల మార్గాయాస మపనయించి
శార్వరీ ! నీ కొసంగు సుస్వాగతంబు !

## శార్వరి స్వాగతము

పూత మోచిన తీవ పొదరింటి పందిట
తెలిదమ్మి పుప్పొడి తిన్నె దీర్చి
అలరు దేనియ తేట కలయంపి చిలికి తే
మొగ్గల ముత్యాల ముగ్గు వెట్టి
పుండ్రేక్షురసపూరమున పాద్యమర్పించి
విరిమల్లె పూదండ అఱుతవైచి
ఎలదేటి రెక్కల తళుకు ధూపము వేసి
పవడంపు జివురు నివాళి పట్టి
జీవితము వోలె తీపియు చేదు గలుగు
వేప పూపచ్చడింత నైవేద్య మొసగి
శార్వరీ ! నీకు ప్రథమ వసంతపూజ
సలుపుచున్నది మా యాంధ్రజాతి నేడు !

ఆకులపాటు పాలై క్రుసుక్క జీవలో
కమునకు నవవికాసము ఘటించి
పాలమెండి నోరెండి యలమటించెడు ప్రాణ
తతులకు నీటిమొద్దడిని మాన్చి
కడుపుచల్లని మబ్బుకడవలతో ధరా
హృదయమ్ములో కృపామృతము నింపి

## ముక్తఝరి

వలువలెత్తెడు సరస్వతుల సింగారింప
ముదురువెన్నెల మేలిముసుగు వైచి
పైరుపచ్చలు సుంకులు వారజేసి
యడుగడుగున తెలిమంచు జడులు కురిసి
కారులారింట లోకోపకారివగుచు
శార్వరీ ! మా కృతజ్ఞతాంజలులు గొనుము !

భారతసీమాంతభాగముల్ చైనా దు
రాక్రాంతితో చెరలాడు తఱిని
భారతమ్మె తృతీయ పంచవర్ష ప్రణా
ళికను సాధింప పూనుకొను తఱిని
పన్నులబరువు దుర్భరమై ప్రజాశక్తి
యంతకంతకు దిగనారు తఱిని
అర్ధనగ్నము బుభుక్షాతురమై పేద
జీవిత మల్లాడిపోవు తఱిని

ఒదవినది నీ శుభాగమనోత్సవమ్ము
శార్వరీ ! నీదు శక్తివంచనములేక
చిక్కులం దీర్చి నీ పేరు చెప్పుకొనగ
మంచిగావించి మాట దక్కించుకొనుము !

# మా బా పూ జీ

చేవఁదొఱంగి సత్త్వ నశించి శతాబ్దులనుండి దీర్ఘ ని
ద్రావశులై జడమ్ములై విధమ్మున నున్న యధీర భారతీ
యావళి మేలుకొల్పి యసహాయ మహోద్యమ దీక్షతో జ్వాల
త్పావకులం బొనర్చితివి భారతభాగ్యవిధాత ! బాపుజీ !

త్రాచుకోఱల సుధాధార జ్వాలారింపఁ
జాలు బుద్ధుని యహింసామహస్సు
శిలువమీఁదను స్రవించిన జీససు హృదయాం
తర రక్తధారల త్యాగమహిమ
ఇసుకయెడారి సౌహృదము నేర్చిన మహ
మ్మదు జీవితంపు నమ్మకపు బలము
అస్పృశ్యతాగ్ని జల్లార్ప దారకసుధం
బంచు రామానుజు భక్తిరసము
వెరసి నీవైన నీ యాత్మ చరిత యీ య
శేషదేశాల యెల్లల జెఱపివైచి
పల్లెలకు బట్టణాలకు బచ్చతోర
ణమ్ము లీనాడు గట్టుచున్నది మహాత్మ.

## ముక్తఝరి

నెత్తుటి చుక్క గారని ధరణిం బడసీ స్వతంత్రతా ధ్వజం
బెత్తిన శాంతియోధుడవు; హింసకు నొదలలొగ్గి యొండొకల్
కుత్తుక లుత్తరించుకొను క్రూరులె నీ కడకుం గటారులున్
గత్తులు దెచ్చి కైవస మొనర్చి రదెంత మహాతపస్వివో.

నీ వలన భారతమున బానిసతనమ్ము
అంతరానితనమ్ము నేడంతరించె
భ్రాతృ రక్తాక్తమగు కురుక్షేత్ర సీమ
నిశ్చల ప్రేమశాంతి పండించి తీవు.

నవ్వులోన గగనారవ మొలుకుచు
మాటలోన నిగమంబుల జిలుకుచు
చూపులోన ధీమా పురిగొలుపుచు
నడిపించితి వీ నవభారతమును.

సేదగొన్న శ్రమజీవికి శరణము
పల్లెవాకిటికి బచ్చంతోరణము
అంధజగతి కాశాగుణ కిరణము
జయ మహాత్మజీ జయ బాపూజీ!

---

## శ్రద్ధాంజలి:

పరదాస్యాంధతమసం బడంచిన జగద్బంధుండా సర్వప్రజా
దరముం జూరలుగొన్న నాయకుడు విద్యారణ్య చాణక్యాతి
మ్మకును న్మించిన నీతివేత్త, యనుకంపా సాగరుండైన జ
హ్వరులాలున్ స్మరియించి భారతము నేడర్పించు శ్రద్ధాంజలిన్

అతడు స్వాతంత్ర్యభారతధరాదిమ మంత్రివరేణ్యుడాతడ
ప్రతిమ మనీషి, యాతడు నిరంతర లోకహితైక దీక్షితుం
డాతడు మనస్వి, ఆతడు మహాత్ముని వారసుడాతడీ జగ
త్ప్రశంసకరు డట్టివాని స్మరియింతుము జహ్వరులాలు పండితున్.

మోతీలాలు స్వరూపరాణి తెడ సమోన్నదంబునన్ పొంగ గాం
ధీతోడ న్సరదార్పటేలు కమలా నెహ్రూ వినంగా అహిం
సా తత్త్వమ్మును గూర్చి దేవవిభుతో చర్చించుచు న్దేవతా
వ్రాతంబు న్దనియించుచుంటివొకొ స్వర్గంబందు ప్రజ్ఞానిధీ!

తండ్రి మేటిమైన తనయుండు సుంతయా
ననెడిమాట నేడబద్ధమయ్యె
కన్నతండ్రికన్న నన్నింట ఘనుడవై
లోకవినుతి గనిన నీకతాన.

అమరపురి కీవు జని శరత్తైన గాని
నిఖిల జగతి నీనాడును నిను స్మరించి
నయనములు చెమ్మగిలని మానవుడు లేడు
ఓయి జవహరులాలు నెహ్రూ! బుధేంద్ర!

తన వారసునిగ నెంచిన మహాత్ముని త్రోవ
నడిపిన నీ యోలుబడి తలంచి
కలసమస్తము దేశ కళ్యాణమునకు
నర్పించిన నీ త్యాగరేఖ నెంచి
తలపండిన బుధోత్తములు తల లూపిన
తావక గ్రంథ వైదగ్ధ్యమెంచి
దేశదేశాల కెత్తిన తెలిబావుటా
యైన నీ భూరి సద్యశము నెంచి

# శ్రద్ధాంజలి

జైలులోన బయట సకుటుంబముగ నీవు
చేసినట్టి దేశసేవ నెంచి
గాఢభక్తి నేడు కన్నీటి తర్పణం
బాచరించుచుంటి మయ్య నీకు.

వేలార్జించిన న్యాయవాదివరు డుర్వ్యానాథ భోగంబులన్
దేలన్జాలిన భాగ్యశాలియగు మోతీలాలు నెహ్రూ యశశ్శ్రీ
లాలాటిక మౌక్తికంబవయి కీర్తిన్ తండ్రిని న్మించి పు
త్రాలంకారుడవైతి పండితవరేణ్యా లోకశాంతిప్రియా!

ఒక ఏడాది గతించె భారత సమస్తోర్విన్ భవత్పాంచ భౌ
తిక దేహంబు విలీనమై అదియె ఆర్తిన్ గుందుచున్నట్టి జా
తికి నెల్లన్ పరిపుష్టి తుష్టి విడి శక్తిన్ శాంతినిన్ గూర్చి ర
క్షకమై దేశమె నీవుగా నెడదకు న్గన్పట్టు మా కెప్పుడున్.

స్వార్థంబంటని భక్తితో తమ ధన ప్రాణంబుల న్మాతృదే
శార్థం బర్పణ జేసినట్టి నిను నే దర్శింతు మీనాడు మా
వ్యర్థ ద్వేష విభేదము ల్మరచి నీ యట్లాత్మదేశాభి వృ
ద్ధ్యర్థం బేకమనమ్ముతోడ కృషిసేయ న్నమ్ము దీవింపుమా.

---

# మిత్రస్మృతి*

చీకటుల మూఁతవడిన నిశీథవేళ
ఎవ్వరే యార్పినారు నట్టింటి దివ్వె
జనని విశ్వోదయ కళాప్రసన్న ముఖము
మసక చీఁకట్ల పొగ గ్రమ్మ మాపువడఁగ.

వినువీధి నెగురాడు పెనుఘూక మిట్లేల
యెలుఁగిచ్చి మృత్యువు పిలిచినట్లు
అపచార మొనరించినట్టు లీ పొగబండి
యూర్పుపోఁగఁ బుచ్చుచున్న దేల
చూడఁగూడని దేదొ మూఁడినట్లే చిమ్మ
చీకటుల్ చోత్కృతి సేయునేల
ఆత్మబంధువు పోయినట్లు కావలి ప్రజా
కోటి యింతగ నేల గోలపెట్టు.

ఏ మహా ప్రాణభరమొ వహింపలేక
గతినిశానిలమిట్లు వగర్చునేల
పలుకరాని దేదో మహోపద్రవమ్ము
సంభవించెను గాంబోలు జగతి కిపుడు.

ఘోరమృత్యువు గాఢాంధకారమందు
భయదమగు ధూమశకట రూపమున వచ్చి
అకట! మా యాత్మబంధు మా ప్రాణతుల్యు
మిత్రు, మా 'రమణయ్య' ను మ్రింగివైచె.

స్వార్థ మెరుగని బుద్ధికి, శ్రమ యెఱుగని
సేవకు, విభేద మెఱుగని స్నేహమునకు
జగతి దుర్మృతియే ఫలమ్మగున యేని
మంచికింక నేమి విలువ ప్రపంచమందు !

స్వపరభేదము తలంపక చెమటోడ్చు
నిరంతర సేవా పరాయణుండు
తన కష్టసుఖము లేతఱి లెక్కసేయని
కార్యనిర్వహణ దీక్షారతుండు

ఆరునూరైన నూరారైన పాడిదప్పని
యట్టి ధైర్య విశ్వాసపరుఁడు
ఎప్పుడైన మొగముపై నెల నవ్వెగాని యా
వంత కోపములేని శాంతమూర్తి.

తోడివారల నెల్ల సైదోడులట్టు
లాదరించు నపార కృపార్ద్రబుద్ధి
అకట! మా 'రమణారెడ్డి' యాప్తసఖుడు
లేఁడు మఱి రాడు, కనఁబడబోఁడు మాకు.

భ్రాతగా నిన్ను సంభావించు విద్యార్థి
సంతానమును నిరాశ్రయ మొనర్చి
చెమట నెత్తురుగ నీచేఁ బెంపబడిన శా
వలి కళాశాల నాకులము పఱిచి
ఆరమ్రగ్గిన ఫలం బామయ పీడిత
మైన నీ జనని దుఃఖార్త జేసి
నీవె లోకమ్మైన నిందుచూలాలి నీ
యిల్లాలిఁ గన్నీటి వెల్లిఁ ద్రోసి

ఎల్లప్రాపు నీవైన యింటిల్లి పాది
నాపదంబుధి ముంచి మిత్రాళి నొంచి
ముప్పదేండ్లకె నూరేండ్లు ముగియఁ జేసి
యమరపురి కేగితే మహోత్తమ చరిత్ర !

ఏడ్చుచున్నారు గొంతెత్తి నీ కోసమై
  కూలిజనంబు కాబోలు వారు;
అడలుచున్నారు విద్యార్థులు కాఁబోలు
  చెట్టుకూలిన గూటి పిట్టలట్లు ;
అదుగో మీ దొడ్డ యబ్బయ్య కాఁబోలు
  నీ మృతివార్త దెలిసి మూర్ఛిల్లినాఁడు ;
పాపము వార లధ్యాపకుల్ కాఁబోలు
  అశ్రుధారాపూరితాక్షులైరి

వారు పౌరులు కాబోలు వగచి వగచి
చెప్పుకొను చుండి రీవు చేసిన పనులను
ఇందఱను దుఃఖపెట్టి యెట్లేగితయ్య
స్వర్గపురికీ వొకింతైన జాలి లేక.

ఏ తీవపూచెనో యీ పూవు కమ్మని
సౌరభమ్ముల వెదజల్లి పోయె
ఎచ్చోట పుట్టెనో యీ మబ్బు తాపముల్
వీయఁ జల్లని నీడఁ బఱపిపోయె
ఎవరు వెల్గించిరో యీ దివ్వె యింటింట
మంగళకాంతు లొసంగి పోయె
ఏనీటఁ బెంచిరో యీ మహావృక్షమ్ము
తీయని ఫలము లందించి పోయె

అనుచు నీ సద్గుణములు, నీ స్వార్థరహిత
సేవ, నీ దయాశక్తి, నీ స్నేహరక్తి
అందఱు నుతింపఁ బడుచు ప్రాయమునందె
స్వర్గముం జేరఁ బోతివా ప్రాణసఖుడ !

లోకములోని సర్వజనులున్ వినుతింపఁ జరించినట్టి సు
శ్లోకుని నిన్ను నొక్క త్రుటిలో దిగమ్రింగెను మృత్యువయ్యయో
మాకిఁకఁ గానరావుగద మా హృదయమ్ముల భీకరాగ్ని కీ
లాకృతి మండు దుఃఖమిఁక నారునె తీరునె నీ గుణస్మృతుల్.

పోయిన వారెటుల్ బ్రతుకఁ బోవరు గుండెలు వ్రీలనెంత వా
పోయినఁ గాని నిన్మఱచి పోగలమే? త్వదనారత శ్రమో
పాయనమౌ కళానిలయ వాటికఁ గన్గొని నప్పుడెల్ల నీ
మాయని తీయనైన స్మృతి మా కనులం దడి సేయకుండునే?

అందఱి మెప్పుతో గడచినట్టి భవత్సుకృతైక జీవితం
బందున నిందు లోప మిసుమంతయు లే కలరారునైన మా
డెందము లార్తి చే నటమటింపక తప్పదు, నిన్ను దుర్మృతిం
బొందఁగఁ జేసి పాడువిధి భూజన నిందకు నోర్చె నింతకున్.

కైలాసాచలమందో, పద్మభవలోకం బందో, వైకుంఠ మం
దో, లేఖాధిపలోకమందో. మఱియెందో, త్యాగమూర్తుల్ దయా
శాలుల్, దేశహితైక జీవితులు నిచ్చల్ నిన్ను మన్నింప సౌ
ఖ్యాళిం దేలుచు పొందుమయ్య రమణయ్యా శాశ్వతానందమున్.

---

* కీ. శే. శ్రీ పి. రమణారెడ్డి మొదటినుండి కావలి కాలేజీకై పాటుపడిన వారిలో ఒకరు. నిషధయోగ్యుడు. లోకములో అతనికంటె జనప్రియు లరుదు. అత నొకనాడు కాలేజీనుండి వస్తూ రైలుక్రింత పడి చనిపోయాడు అతని దుర్మరణానికి కావలిలో కన్నీరు పెట్టని మనిషి లేదు. అతని మరణమువల్ల నాకు కలిగిన దుఃఖమే ఈ పద్యములుగా వెలువడినది.

## దీవన*

ఒజ్జగ నన్ను జేపట్టుకొనుచుందువు విద్యను నేర్చుకున్న నా
పజ్జను; నీకుఁ జేకుఱిన పాండితియుం రసవత్కవిత్వ సం
పజ్జయమున్ స్వయంకృషిని ప్రాప్తిలెన్నైనను నన్నుఁగొల్చు నీ
హృజ్జలజాత గౌరవపరీమళ మేనెపుడో గ్రహించితిన్.

పిన్నన్ నిన్నని యొజ్జనైనపుడె హృద్వీథిన్ కళాభోగ సం
పన్నత్వంబును, కావ్యశేఖరతయున్ బ్రాపించు నీ కంచు నే
నెన్నోసారులు నీ స్థితిం దలతు శ్రీశ్రీశుండు నిన్నల్లె నా
సన్నాహోక్తులు సార్థమై చెలగనుత్సాహంబుగూర్చెన్ మదిన్.

ముప్పదియేండ్లనుండి గురుపుంగవుగా కవిగా తలంతుగా
కిప్పగిదిన్ స్వబుద్ధిని గృతీశ్వర గౌరవ మే విశేషముం
జొప్పడనట్టి నాకొసగి జోగియు జోగియు కౌగలించుకో
గుప్పెడు బూదిరాలు ననుగొంట యథార్థమొనర్చితియ్యెడన్.

## దీవన

కవితాచాతురి కగ్రహారము లొసంగం జాలు భూపాలక
ప్రవరుల్ లేమి నిజంబు నేడయిన దీవ్యత్ వైభవోదార మే
రువులౌ వారికి కావ్యమిచ్చునెడ దీగున్ నీకు దారిద్ర్య మీ
కవికిం బేదకు దేశికుండని యొసంగన్ లాభమేమయ్యెడిన్.

చెప్పక చేయకంకితము సేసితి నీ తొలికబ్బమీవు నా
కొప్పుదు దప్పు జూచుకొనకుండ భవద్గురుభక్తి నెంచి నే
నొప్పితి నింకనై సహృదయుల్ కృతిమెత్తురయేని నీకు నా
కప్పుడు చేకురుంజుమి కృతార్థతయున్ హృదయప్రమోదమున్

నీకు ధనాశలేదు మఱి నే ధనధాన్యము లీయజాల ; కా
నీ కవి నౌట నీ మనసు నిండుగ దీవన మాత్ర మిత్తు వా
ణీ కమలా కటాక్షముల నీడ సమానులలోన నుత్తమ
శ్లోకుడవౌదుగాక! సరసుల్ దలలూచు కృతుల్ రచించుచున్.

---

* ఒక శిష్యుడు కావ్యమంకితము చేసినపుడు చెప్పిన పద్యము లివి.



# మనసా!

ఈ భవాంభోధి నీవేరీతి దాటేవు
ఏమి తలపోసేవె ఓ మనసా!

కన్ను గానగరాని కటికి చీకటిలోన
ఎన్నాళ్ళు నీ బ్రతుకు ఓ మనసా!

అస్తమించెను సూర్యు డంతరించెను సంధ్య
అయిపోయె నీ రోజు ఓ మనసా!

గట్టుపై కూర్చుండి కంట నీరిడుచున్న
కానరాదే దారి ఓ మనసా!

ఇల్లు వాకిలిగాని, ఇల్లాలుగాని, నీ
కిపుడు తోడౌనటే ఓ మనసా!

కల్ల బంధాలెల్ల చల్లగా తెంపుకొని
గతి యేదో చూడవే ఓ మనసా!

భవ్యతేజోమూర్తి, భవకర్ణధారి ఆ
పరమేశు డొక్కడే ఓ మనసా!

ఆపదలు - గీపదలు అణగునే ఇకనయిన
అతడె శరణనుకోవె ఓ మనసా!

---

MUKTAJHARI PS. 4-OC

BY

SRI VEDULA SATYANARAYANA SASTRY.

# మా ప్రచురణలు

| | | |
|---|---|---|
| [illegible] కథ | ... ... | 2—0 |
| ముక్తఝరి - కవితా సంకలనం | ... | 4—0 |

శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రిగారి ఇతర రచనలు కూడ క్రమముగా మేము వెలువరించుచున్నాము.

వలయువారు :

1. శిలిగం జగన్నాథం,
వ్యవస్థాపకుడు,
శ్రీ [illegible] గ్రంథమాల,
[illegible] నవరం,
[illegible] జిల్లా, [illegible]

2. [illegible], రాజమండ్రి - [illegible]

[illegible] ప్రెస్ - నాళంవారి సత్రంవద్ద, రాజమండ్రి - [illegible]